
కుర్చీలు ఖాళీ..!

- డ్వామాలో ఇన్‌చార్జిల పాలన
- క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఇద్దరే..
- ఉపాధి సీజన్ ప్రారంభంతో ఇక్కట్లు



డ్వామా పీడీ కార్యాలయం



అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థలో ఇన్‌చార్జిల పాలన సాగుతోంది. కీలక పోస్టుల్లో అధికారులే లేరు. డ్వామా పీడీ కార్యాలయంలోని ఏఓ, ఎఫ్‌ఎం, విజిలెన్స్ విభాగ పోస్టులు కూడా ఖాళీయే. ఇదివరకు విజిలెన్స్ అధికారిగా పనిచేసి, అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న రమణారెడ్డి ఎఫ్‌ఎంగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల ఆయన డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఉపాధి పథకం సూపరింటెండెంట్‌గా ఉన్న శశికళకు విజిలెన్స్ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ట్రెజరీ నుంచి వచ్చిన రాధకు ఎఫ్‌ఎం బాధ్యతలు ఇచ్చారు. తాడిపత్రి, రాయదుర్గం, ఉరవకొండ, అనంతపురం క్లస్టర్లకు సైతం ఇన్‌చార్జి ఏపీడీలే ఉన్నారు. గత ఐదేళ్లలో డ్వామాలో కీలకంగా ఉండే క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. 2014-19 మధ్య కాలంలో ఐదుగురికి పైగా అధికారులు ఉండే క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ప్రస్తుతం ఇద్దరు కొనసాగుతున్నారు. ఆ ఇద్దరిలో కూడా ఈఈ నాలుగు జిల్లాలను పర్యవేక్షిస్తున్నారు. దీంతో డ్వామా పనుల్లో నాణ్యతను పరిశీలించే ప్రక్రియకు స్వస్తి పలికారు. ఇతర శాఖల నుంచి డ్వామాకు డెప్యుటేషన్‌పై రావడానికి ఆసక్తి చూపడంలేదు. జీతాలు ఆలస్యం అవుతుండడం, బోగస్ మస్టర్లను కట్టడి చేయడం ఇందుకు కారణాలని తెలుస్తోంది.

ఒక పీడీ.. ముగ్గురు ఏపీడీలు

డ్వామాలో ఒక పీడీ, ముగ్గురు ఏపీడీలు మాత్రమే రెగ్యులర్ కింద ఉన్నారు. మిగిలిన అన్ని కీలక పోస్టుల్లో ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. అనంతపురం క్లస్టర్‌కు ఏపీఓ చెన్నకేశవయ్య ఇన్‌చార్జి ఏపీడీగా ఉన్నారు. గుత్తి క్లస్టర్ ఏపీడీ విజయ్‌కుమార్ తాడిపత్రి క్లస్టర్ అదనపు బాధ్యతలు చూస్తున్నారు. డ్వామా సీబీ ఏపీడీగా ఉన్న అయేషా రాయదుర్గం క్లస్టర్ ఇన్‌చార్జి ఏపీడీగా ఉన్నారు. కళ్యాణదుర్గానికి మాత్రమే డీఎల్‌డీఓ రమేష్‌నాయక్ ఏపీడీగా ఉన్నారు. వాటర్‌షెడ్‌లో ఏఓగా ఉన్న కృష్ణచైతన్య ఉరవకొండ క్లస్టర్ ఇన్‌చార్జి ఏపీడీగా వ్యవహరిస్తున్నారు. డ్వామా పీడీ కార్యాలయంలో కీలకంగా ఉండే ఏఓ పోస్టును వాటర్‌షెడ్ ఏపీడీ సుధాకర్ రెడ్డి చూస్తున్నారు.

సీజన్‌లో కష్టమే..



ఉపాధి హామీ సీజన్ ప్రారంభమైంది. ఏటా ఫిబ్రవరి నుంచి మార్చి, ఏప్రిల్, మే, జూన్ వరకు ఉపాధి సీజన్ ఉంటుంది. ఈ ఐదు నెలలు కచ్చితంగా అధికారులు, క్షేత్రస్థాయి ఉపాధి సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేస్తేనే పురోగతి సాధ్యమవుతుంది. ప్రస్తుతం జిల్లాలో సగటున 46వేల మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. ఈ సమయానికి ఏటా రోజుకు 80వేల పనిదినాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇన్‌చార్జిల పాలనతో ఉపాధి పనిదినాలు కల్పించడంలో కష్టమవుతోందని డ్వామా వర్గాలు వాపోతున్నాయి.

డ్వామాకు వచ్చేందుకు ససేమిరా



ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇతర శాఖల నుంచి డ్వామాకు వచ్చిన అధికారులకు జీతాలు సరిగా అందలేదు. మూడు, ఆరు నెలలకో సారి వచ్చేవి. 2014-19 మధ్య కాలంలో ఇతర శాఖల నుంచి డెప్యుటేషన్‌పై వచ్చే ఉద్యోగులు, అధికారులకు సక్రమంగా జీతాలు చెల్లిస్తూ వచ్చారు. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఇతర శాఖల నుంచి వచ్చిన అధికారులకు జీతాలు చెల్లించడం ఆలస్యం చేస్తూ వచ్చింది. దీంతో డ్వామాకు డెప్యుటేషన్‌పై వచ్చేందుకు ఇతర శాఖల అధికారులు ఆసక్తి చూపడం లేదు. బోగస్ మస్టర్ల కట్టడికి కూటమి ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. దీంతో జీతాలు రాకపోగా... బోగస్ మస్టర్లు లేకపోతే ఎలా అని చాలా మంది వెనకడుగు వేస్తున్నారు.

కనిపించని క్వాలిటీ కంట్రోల్

డ్వామా పరిధిలో చేపట్టే ఉపాధి, వాటర్‌షెడ్, ఎన్టీఆర్ జలసిరి పనుల్లో నాణ్యతను పరిశీలించేందుకు క్వాలిటీ కంట్రోల్ విభాగం ఉండేది. ఐదేళ్ల వైసీపీ పాలనలో క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని కనుచూపు మేరలో కనబడకుండా చేసేశారు. పైగా క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఐదుగురుపైగా ఇంజనీర్లు, సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం జూనియర్ క్వాలిటీ కంట్రోలర్, ఈఈ మాత్రమే ఉన్నారు. ఈఈ కూడా నాలుగు జిల్లాలకు ఒక్కరే ఉన్నారు. దీంతో డ్వామాలో చేస్తున్న పనులను నాలుగేళ్లుగా పరిశీలించిన పాపానపోలేదు. ఉన్న ఇద్దరు కూడా ఇప్పటి వరకు డ్వామా ఆఫీస్‌లో కనిపించిన దాఖలాల్లేవు. తమకు ఆఫీస్‌లో స్థలం లేదంటూ ఇంటికే పరిమితమయ్యారు.

మార్చిలో కొత్త ఏపీడీలు...



మార్చిలో కొత్త ఏపీడీలు వస్తారని ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చింది. అప్పటి వరకు ఉన్న ఇన్‌చార్జి ఏపీడీ, ఇతర సిబ్బందితోనే నెట్టుకు రావాల్సిందే. సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేస్తూ పని దినాలు పెంచుతూ, ఉపాధి కూలీలకు కనీస వేతనం పడేలా చర్యలు తీసుకుంటున్నాం. పూర్తిస్థాయిలో ఏపీడీలు వస్తే ఉపాధి పనులు కల్పించడంలో మరింత పురోగతి సాధిస్తాం. క్వాలిటీకంట్రోల్ విభాగం కూడా ఉంది. ఇందులో ఉద్యోగులు పనిచేస్తున్నారు. మిగిలిన అన్ని విభాగాలకు రెగ్యులర్ అధికారులు వస్తే మరింత పురోగతి సాధించే అవకాశం లభిస్తుంది.

- సలీం బాషా, డ్వామా పీడీ

మళ్లీ వస్తున్నారా..?

అటవీశాఖ పనిమంతుడికి ఉద్యోగోన్నతి..!

బదిలీపై అనంతకు వస్తున్నట్లు ప్రచారం



జిల్లా అటవీశాఖ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీశాఖ కార్యాలయంలో పదేళ్లపాటు రాజ్యమేలిన పనిమంతుడు.. బదిలీపై తిరుపతికి వెళ్లినా.. తిరిగి ఇక్కడికి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయన బదిలీ ఉత్తర్వులు సిద్ధమయ్యాయని విశ్వసనీయంగా తెలిసింది. సీనియర్ అసిస్టెంట్‌గా ఇక్కడ పనిచేసిన ఆయన.. బదిలీ నుంచి తప్పించుకునేందుకు తీవ్రంగానే ప్రయత్నం చేశారు. కానీ ఐదేళ్లు దాటితే బదిలీ తప్పదని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో తిరుపతికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇక్కడికి నియమితులైన వారు బాధ్యతలు చేపట్టడం ఆలస్యమైంది. దీంతో ఉన్నతాధికారులను సంప్రదించి, పరస్పర బదిలీ కోసం ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రచారం జరిగింది. ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో గత్యంతరం లేక తిరుపతిలో బాధ్యతలు చేపట్టారు. అయినా పట్టు వీడకుండా అనంతపురంలో తిరిగి పాగా వేయడానికి పావులు కదుపుతూనే ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్‌గానే తిరిగి వస్తారన్న ప్రచారం కార్యాలయంలో జరిగింది. కానీ కొత్తగా వచ్చిన ఉన్నతాధికారి ఒప్పుకోలేదని సమాచారం. ఈ నేపథ్యంలో ఇక్కడ ఉన్న సూపరింటెండెంట్ బదిలీ అయ్యారు. ఆ స్థానం ఖాళీగా ఉందని తెలుసుకున్న పదేళ్ల పనిమంతుడు.. ఉద్యోగోన్నతి ద్వారా రావాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఆ దిశగా భారీగా ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. ఆరు నెలలు గడవకనే తిరిగి అనంతకు ఆయన వస్తున్నారని తెలిసి బాధిత సిబ్బందితో గుబులు మొదలైంది. సూపరింటెండెంట్‌గా అనంతకు ఆయనను నియమిస్తూ.. సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉందని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రేపు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదిక ఈ నెల 24వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోనే నిర్వహిస్తున్నామని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ శనివారం తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. వాటిని పరిశీలించి, ఆయా శాఖల అధికారులు పరిష్కరిస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు కోరారు.

చిత్తడి నేలల గుర్తింపు

భూగర్భ జలాల మెరుగుకు చర్యలు

జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్



అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 15 ప్రాంతాల్లో చిత్తడి నేలలు గుర్తించినట్లు జిల్లా అటవీశాఖాధికారి విఘ్నేష్ తెలిపారు. శనివారం పలు విషయాలను ఆయన వెల్లడించారు. చిత్తడి నేలల గుర్తింపునకు సంబంధించి రెండు రోజుల క్రితం కలెక్టర్‌తో సమావేశమైనట్లు తెలిపారు. అందులో భాగంగా సంబంధిత శాఖల అధికారులకు పలు కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. చిత్తడి నేలల గుర్తింపుకోసం కమిటీని వేశారని తెలిపారు. కమిటీలో అటవీశాఖ అధికారితో పాటు డ్వామా పీడీ, మత్స్యశాఖ డీడీ, ఇరిగేషన్ ఎస్ఈ, సర్వే విభాగం ఏడీ ఉంటారని అన్నారు. జిల్లాలో 15 ప్రాంతాల్లో చిత్తడి నేలలు ఉన్నట్లు గుర్తించామని వివరించారు. అనంతపురం రూరల్ మండలంలోని ఆలమూరు చెరువు, నజ్జల కాలువ, బుక్కరాయసముద్రం మండలంలోని అనంతసాగర్, గుంతకల్లు (పాలకొత్త చెరువు), గుత్తి (జక్కలచెరువు), శింగనమల (సలకం చెరువు), గార్లదిన్నె (మిడ్ పెన్నార్ రిజర్వాయర్), కళ్యాణదుర్గం (ఓబుళాపురం ట్యాంకు), గుమ్మఘట్ట (చెరువుదొడ్డి), ఉరవకొండ (రాచర్లమ్మ చెరువు, మోపిడి చెరువు), వజ్రకరూరు (జయరామపురం చెరువు), రాప్తాడు (బొమ్మేపర్తి చెరువు), రాయదుర్గం (ఉడేగోలం చెరువు)ను చిత్తడి నేలలుగా గుర్తించామని పేర్కొన్నారు. మరిన్ని ప్రాంతాల్లో పరిశీలిస్తామని తెలిపారు. పూర్తి స్థాయిలో సర్వే చేయించి అన్యాక్రాంతమైన వాటిని స్వాధీనం చేసుకుంటామన్నారు. వీటిలో పూర్తి స్థాయిలో వర్షపు నీటిని నిలువ చేసుకొని భూగర్భ జలాల మెరుగుకు చర్యలు చేపడతామని తెలిపారు.

ఎక్కడున్నావ్ రవీ..?

ఆస్పత్రి నుంచి రోగి అదృశ్యం

ఫిట్స్ వచ్చి.. మతిస్థిమితం కోల్పోయి..

పోలీసులను ఆశ్రయించిన భార్య


రవి (ఫైల్)

గుడివాడ సమీపంలోని కోడూరుకు చెందిన మల్లంపల్లి రవి.. ఏడేళ్ల క్రితం తాడిపత్రికి తన కుటుంబంతో వలస వచ్చారు. పట్టణంలోని సీపీఐ కాలనీలో వీరు ఉంటున్నారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఏడేళ్ల కూతురు, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవలే నంద్యాల రోడ్డులో సొంతంగా బైక్ మెకానిక్ షాపు ప్రారంభించారు. 2012లో జరిగిన ప్రమాదంలో రవికి గాయాలయ్యాయి. ఈ కారణంగా అప్పుడప్పుడు అనారోగ్యానికి గురయ్యేవాడు. ఈ నెల 17వ తేదీ రవికి ఫిట్స్ వచ్చాయి. కాసేపటికి మతిస్థిమితం కోల్పోయాడు. దీంతో చికిత్స నిమిత్తం ఆయనను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. 18వ తేదీ ఉదయం పైకి లేచి నడుస్తూ కిందపడ్డాడు. తలకు దెబ్బతగిలింది. స్కాన్ చేసి.. బ్లడ్ క్లాట్ అయిందని చెప్పారు. రవి బెడ్‌పై పడుకుని ఉండగా, పాలు తెచ్చేందుకని ఆయన భార్య, తన ఇద్దరు పిల్లలతో కలిసి కిందకు వెళ్లారు. తిరిగి వెళ్లేసరికి బెడ్‌పై భర్త కనిపించలేదు. సిబ్బందిని అడిగితే.. కిందకు వెళ్తొస్తానని చెప్పిపోయాడని అన్నారు. ఆస్పత్రి ఆవరణలో, బయట వెతికినా కనిపించలేదు. బయట అడిగితే.. బొప్పాయిలు కొనుక్కుని వెళ్లాడని ఓ వ్యాపారి చెప్పారు. నగరంలో నాలుగు రోజులపాటు గాలించినా ఆచూకీ లభించలేదు. ఊరుగాని ఊరు. వలస వచ్చినందున.. ఇక్కడ బంధువులు కూడా లేరు. ఆమెకు ఎవరికి చెప్పుకోవాలో తెలియలేదు. ఎవరైనా సలహా ఇచ్చారో.. తనకే ఆలోచన వచ్చిందో.. శనివారం ఉదయం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చింది ఆమె. విషయం తెలుసుకున్న సీఐ శ్రీకాంత్.. ముందు రావచ్చు కదమ్మా.. వెతికిపెట్టేవాళ్లం అన్నారు. 'నాకు తెలియలేదు సర్..' అని ఆమె అమాయకంగా బదులిచ్చారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

కష్టాలు ఆనాటివే..!

- శ్రీరామిరెడ్డి కార్మికులకు రూ.3 కోట్ల బకాయి
- వైసీపీ హయాంలో అందని వేతనం, పీఎఫ్
- రోడ్డెక్కితేగానీ స్పందించని నాటి అధికారులు


జీతాలు, పీఎఫ్ కోసం ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అధికారులు, కాంట్రాక్టర్లు మిలాఖత్ అయ్యారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులను కష్టాల్లోకి నెట్టారు. వేతనాలు, పీఎఫ్ ఇవ్వకుండా వేధించారు. అధికారులు, కాంట్రాక్టర్ పలకడం మానేశారు. ఆందోళనకు దిగితే.. అంతో ఇంతో ఇచ్చేవారు. ప్రతిసారీ రోడ్డెక్కితేగానీ ఫలితం ఉండేది కాదు. ఇలా ఐదేళ్లలో కార్మికులకు రూ.3 కోట్లకు పైగా బకాయి పడ్డారు. కుటుంబ పోషణ భారంగా మారుతోందని కార్మికులు కంటతడి పెట్టినా కరగలేదు. ఉమ్మడి జిల్లాలో 650 మంది ఈ పథకం కింద పనిచేస్తున్నారు. వీరిలో 630 మంది కార్మికులు, 20 మంది సూపర్‌వైజర్లు. కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలోని 750 గ్రామాల ప్రజల గొంతులు తడుపుతున్నారు. కొన్ని గ్రామాలకు శ్రీరామిరెడ్డి పథకం ద్వారా నీరు తప్ప వేరే దిక్కులేదు. అంతటి ప్రాధాన్య పథకంలో పనిచేసేవారి కష్టాలను గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. తాజాగా సమ్మెలోకి వెళ్లడంతో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చర్చలు జరిపారు. పరిష్కారానికి హామీ ఇచ్చారు. అవసరమైతే తన సొంత డబ్బు ఇస్తానని భరోసా ఇచ్చారు. ఇప్పటికైనా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని కార్మికులు కోరుతున్నారు.

ఇవీ బకాయిలు

- ఫేస్-1, 4 పరిధిలో 292 మంది కార్మికులు ఉన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.16,200 ప్రకారం ఆరు నెలల వేతనం రూ.2,83,82,400 బకాయి ఉంది. పీఎఫ్ రూ.2,400 ప్రకారం 30 నెలలకు రూ.2,10,24,000 రావాల్సి ఉంది.
- ఫేస్-2 పరిధిలో 66 మంది కార్మికులు ఉన్నారు. వీరిలో హిందూపురం నియోజకవర్గంలో 52 మంది పనిచేస్తున్నారు. నెలకు రూ.14 వేల ప్రకారం 10 నెలల జీతం రూ.72.80 లక్షలు, రూ.1,230 ప్రకారం 10 నెలల పీఎఫ్ రూ.6.39 లక్షలు రావాల్సి ఉంది. పరిగి పరిధిలో 14 మందికి 30 నెలల పీఎఫ్ రూ.5,16,600 రావాల్సి ఉంది.
- ఫేస్-3లో 172 మంది కార్మికులు ఉన్నారు. వీరు మడకశిర నియోజకవర్గంలో పనిచేస్తున్నారు. నెలకు రూ.14 వేల ప్రకారం ఐదు నెలలకు రూ.12.40 కోట్లు, పీఎఫ్ రూ.2,400 ప్రకారం 10 నెలలకు రూ.41.28 లక్షలు రావాల్సి ఉంది.

మార్చి 3లోపు జమ చేస్తాం

శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులను రావాల్సిన వేతనాలు, పీఎఫ్ మొత్తం మార్చి మూడో తేదీ లోపు జమ అవుతాయి. ఆ దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. కాంట్రాక్టర్‌తో కూడా వివరాలు సేకరించాం. కార్మికులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

- సురేష్, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

కుటుంబాలను ఎలా పోషించుకోవాలి



జీతాలు, పీఎఫ్ ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు. సకాలంలో వేతనాలు ఇవ్వాలి. ఇలా ప్రతిసారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా..? మా బాధలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. అధికారులు దయ ఉంచి సకాలంలో వేతనాలు ఇవ్వాలి.

- హనుమంతరెడ్డి, లైన్‌మ్యాన్

అప్పులు కూడా ఇవ్వడం లేదు



శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులంటే అప్పులు కూడా పుట్టడం లేదు. నేను పదేళ్ల నుంచి లైన్‌మన్‌గా పనిచేస్తున్నాను. ఇలా జీతాలు, పీఎఫ్ ఇవ్వకపోతే కుటుంబ పోషణ రోజురోజుకీ భారంగా మారుతోంది. ప్రతి నెలా సక్రమంగా ఇవ్వాలి.

- నరేష్, లైన్ మ్యాన్

కార్మికులంటేనే చిన్న చూపు



శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులంటేనే చిన్న చూపు చూస్తున్నారు. ప్రతి సారి జీతాలు, పీఎఫ్ ఇవ్వాలని అధికారులు వద్ద వేడుకుంటున్నా సకాలంలో ఇవ్వడం లేదు. మమ్మల్ని పట్టించుకునే వారే కరువయ్యారు. ఇలాగైతే మా కుటుంబ పోషణ ఎలా..?

- గోవిందు

ప్రతి నెలా జీతాలివ్వాలి



శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికీ ప్రతి నెలా జీతాలు సక్రమంగా ఇచ్చేలా చూడాలి. ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్ కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ప్రతి నెలా సక్రమంగా జీతాలు ఇచ్చే విధంగా నిబంధనలు తీసుకోవాలి.

- సురేష్

మా గోడు పట్టదా..?



కార్మికుల గోడు ఉన్నతాధికారులు పట్టించుకోవాలి. ప్రతి సారి ఆందోళన, నిరసన చేస్తే కాని మాకు జీతాలు రావడం లేదు. మమ్మల్ని చాలా నిర్లక్ష్యంగా చూస్తున్నారు. కార్మికులపైనే ఇలా చిన్న చూపు చూస్తే ఎలా? అధికారులు మా సమస్యలను పరిష్కరించాలి.

- రామాంజనేయులు, పంప్ ఆపరేటర్

ఉష్ణోగ్రతలు	శనివారం
గరిష్ఠం	37.0
కనిష్ఠం	21.0

ప్రముఖ పుణ్యక్షేత్రం సౌకర్యాలు మృగ్యం
గూగూడులో సమస్యల తిష్ట 6

లొంగిపోయిన బూసుపల్లి
- గోవా లిక్కర్ కేసు ప్రధాన నిందితుడు 7

త్వరలోనే వర్గీకరణ ఫలాలు

- డప్పు ప్రదర్శనతో ప్రపంచానికి చాటాలి
- కమిషన్ నివేదిక పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ప్రజాప్రతినిధులు, ఉద్యోగులతో చర్చించాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

7




ఈస్ట్ నరసాపురం సమీపాన ఎండిపోయిన చీనీ చెట్టు

వామ్మో.. విల్ట్..

రైతులు లక్షల రూపాయలు వెచ్చించి, కంటికి రెప్పలా కాపాడుకున్న చీనీ చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. విల్ట్ తెగులు సోకి ఉన్నఫలంగా కాపునకు వచ్చిన చెట్లు ఎండిపోయి, మోడుగా మారిపోతున్నాయి. బిడ్డల్లా పెంచుకున్న చెట్ల దుస్థితిని చూసి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. శింగనమల మండలంలో చీనీ విస్తారంగా సాగు చేశారు. కాపునకు వచ్చిన చెట్లను విల్ట్ తెగులు ఆశిస్తున్నాయి. దీంతో చెట్టు నిలువునా ఎండిపోతోంది. రైతులు.. ఉద్యాన శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. విల్ట్ తెగులు అంటూ కొన్ని రకాల మందులను పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. వాటిని పిచికారీ చేసినా ప్రయోజనం లేదు. ఒక్కో తోటలో 40 నుంచి 50 చీనీచెట్లు ఎండిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. అన్ని చెట్లకు విల్ట్ తెలుగు వస్తే పరిస్థితి ఏంటని భయపడిపోతున్నారు. ఇప్పటికైనా ఉద్యానశాఖాధికారులు.. విల్ట్ తెగులు నివారణకు రైతులకు సరైన పరిష్కార మార్గాలు తెలపాలని కోరుతున్నారు. లేదంటే సర్వం నష్టపోతామని అన్నదాతలు వాపోతున్నారు. -శింగనమల, ఆంధ్రజ్యోతి


ఆకలి రాజ్యం
పడమటి సూరీడు పండుగా మారగా..
కొమ్మ తుమ్మెదై వాలి కొరుక్కు తింటోంది..!
(కూడేరు మండలం ఉదిరిపికొండ వద్ద)
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

నేడు యథాతథంగా గ్రూప్-2 పరీక్షలు

తప్పుడు ప్రచారం నమ్మొద్దు
అభ్యర్థులు నిబంధనలు పాటించాలి
కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షల విషయంలో ఎలాంటి వదంతులు నమ్మవద్దని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గ్రూప్-2 పరీక్షల విషయంలో వాయిదా వేసినట్లు శనివారం ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఓ ప్రకటనలో అధికారికంగా స్పష్టత ఇచ్చారు. ముందుగా నిర్ణయించిన మేరకు గ్రూప్-2 పరీక్షలు 23వ తేదీ (ఆదివారం) యథాతథంగా జరుగుతాయని పేర్కొన్నారు. గ్రూప్-2 పరీక్షలు వాయిదా అంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని అభ్యర్థులకు సూచించారు. ఏపీపీఎస్సీ నుంచి అందిన సమాచారం మేరకు షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. జిల్లాలో మొత్తం 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని అన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఓ ఐడెంటీ కార్డు తీసుకు రావాలన్నారు. మరోవైపు పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పర్యవేక్షించారు.

నేడు ఎక్సైజ్ అధికారుల సంఘం ఎన్నికలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారుల సంఘం కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ సారి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని సంఘం నాయకులు నిర్ణయించినట్లు సమాచారం.

10 టన్నుల టమోటా కొనుగోలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో 10 టన్నుల టమోటా కొనుగోలు చేశారు. శనివారం కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ ఆధ్వర్యంలో కిలో రూ.8తో పది టన్నులు కొనుగోలు చేసి విజయవాడకు పంపించారు.

చీనీ కాయలు టన్ను రూ.20వేలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.20,700, కనిష్ఠంగా రూ.3,100, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 110 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

28న ఉమర్ అలీషా జయంతి వేడుకలు

హాజరు కానున్న 9వ పీఠాధిపతి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం 6వ పీఠాధిపతి కవిశేఖర డాక్టర్ ఉమర్ అలీషా 140వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 28న లలితకళా పరిషత్‌లో రాష్ట్రస్థాయి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమర్ అలీషా సాహితీ సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజుద్దీన్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రతియేటా పిఠాపురం, భీమవరం, బెంగుళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి వేడుకలను ఈసారి అనంతపురం జిల్లాలో నిర్వహించేలా తీర్మానించినట్లు తెలిపారు. వేడుకలకు పీఠం 9వ పీఠాధిపతి ఉమర్ అలీషా విశిష్ట అతిథిగా హాజరవడంతోపాటు 'భారతదేశం - మతసామరస్యం' అనే అంశంపై నిర్వహించే సదస్సులో ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

ప్రముఖ పుణ్యక్షేత్రం

గూగూడులో సమస్యల తిష్ట

సౌకర్యాలు మృగ్యం

అభివృద్ధి ఊసేలేదు..
కలగా మారిన పర్యాటక కేంద్రం
హామీలకే పరిమితమైన ప్రజాప్రతినిధులు


ఎస్సీ కాలనీలో డ్రైనేజీ లేక రోడ్డుపై మురుగు నీరు

నార్పల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు గ్రామానికి రాయలసీమలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి దర్శనానికి రాష్ట్రం నుంచే పక్కనున్న కర్ణాటక నుంచీ సైతం భక్తులు వస్తారు. బ్రహ్మోత్సవాలకు వేలల్లో తరలివస్తారు. ప్రత్యేక బస్సులు సైతం ఏర్పాటు చేస్తారు. అంతటి ప్రసిద్ధి చెందిన గూగూడులో కనీసం మురుగు కాలువ లేదు. గ్రామస్థులు మురుగు నీటిని రోడ్లపైకి వదులుతున్నారు. ఆ నీరు ఆలయం వద్దకు చేరుతోంది. స్వామి దర్శనానికి వచ్చే భక్తాదులు ఆ మురుగు నీటిని తొక్కుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. గ్రామ వీధులు చాలా ఇరుకుగా ఉన్నాయి. వేలాదిగా భక్తులు వస్తే.. తోసుకుంటూ వెళ్లాల్సిందే. పలుమార్లు తొక్కిసలాటలు కూడా జరిగాయి. ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో గూగూడు అభివృద్ధికి ప్రజాప్రతినిధులు హామీలు గుప్పిస్తూనే ఉంటారు. ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెబుతుంటారు. తర్వాత విస్మరిస్తుంటారు. ఆలయానికి కూడా భారీగా ఆదాయం ఉన్నా.. అభివృద్ధికి ఖర్చు చేయకపోవడం పట్ల గ్రామస్థులు, భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గూగూడు కుళ్లాయిస్వామి క్షేత్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వామి జంట ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. అభివృద్ధి మాత్రం మచ్చుకైనా లేదు. ఏటా బ్రహ్మోత్సవాల్లో కుళ్లాయిస్వామిని ప్రజాప్రతినిధులు దర్శించుకుని, గూగూడును పర్యాటక కేంద్రం చేస్తామని హామీలు ఇస్తున్నారు. అవి మాటలకే పరిమితమవుతున్నాయి. ఎన్నోసార్లు గ్రామ ప్రజలు, భక్తాదులు అర్జీల రూపంలో కలెక్టర్లు, మంత్రులకు గూగూడును అభివృద్ధి చేయాలంటూ విన్నవించుకున్నారు. ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో గూగూడు అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయింది. గ్రామంలో ఎన్నో సమస్యలు ఉన్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

భక్తులకు సౌకర్యాలు కరువు

గూగూడు కుళ్లాయిస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు స్నానాలు చేసుకోవడానికి కూడా వసతుల్లేవు. స్నానాల బావిలో చుక్క నీరు ఉండదు. భక్తాదులు నిద్ర చేయడానికి వస్తే సత్రాలు దుమ్ము, ధూళితో నిండి ఉంటాయి. ప్రతి గురువారం కుళ్లాయిస్వామి దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. క్యూలైన్లు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో వచ్చే మహిళా భక్తులకు స్నానాలు చేయడానికి బాత్‌రూంలు లేక నానా ఇబ్బందులు పడుతుంటారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో తడికల బాత్‌రూంలు ఏర్పాటు చేస్తారు. అవి ఒక్కరోజులోనే కిందపడిపోతాయి. ఆలయం ముందు క్యూలైన్లు లేక తొక్కిసలాటలు జరిగిన సందర్భాలు కోకొల్లలు. గూగూడు గ్రామ పొలిమేర నుంచి స్వామిని దర్శించుకోవాలంటే ఇరుకు వీధుల్లో తోసుకుంటూ వెళ్లాల్సిందే. కనీసం తాగునీరు కూడా దొరకదు.


గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి జంట ఆలయాలు


గూగూడులో భక్తులు స్నానాలు ఆచరించే బావి ఇదే

గ్రామంలో అన్నీ సమస్యలే..

గూగూడు గ్రామంలో మురుగు కాలువలు కూడా లేవు. రోడ్లపైనే నీరు పారుతూ అపరిశుభ్రంగా మారాయి. గ్రామస్థులు రోడ్లపై నీటిని వదలడంతో అది కుళ్లాయిస్వామి ఆలయం వద్దకు చేరుతోంది. నిష్ఠతో వచ్చే భక్తులు.. మురుగు నీటిని తొక్కుతూ స్వామిని దర్శించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామంలో కనీసం వీధి లైట్లు కూడా లేవు. తాగునీరు కూడా దొరకదు. పంచాయితీ బోర్లలో నీరు అడుగంటిపోయింది. వచ్చే అరకొర నీటిని గ్రామం మొత్తం వాడుకుంటున్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

కోటీశ్వరుడు కుళ్లాయిస్వామి

గూగూడు జంట ఆలయాలు దేవదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. స్వామికి భక్తులు సమర్పించిన డబ్బు, నగలు, వెండి గురించి తెలిస్తే నోరెళ్లబెడతారు. కుళ్లాయిస్వామికి భక్తులు సమర్పించిన డబ్బు రూ.5కోట్లు, ఒకటిన్నర టన్ను వెండి, రెండున్నర కిలోల బంగారం ఉన్నట్లు దేవదాయ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇంత డబ్బు, నగలు ఉన్నా.. ఆలయం, గూగూడు గ్రామ అభివృద్ధిని ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని, ఆలయంతోపాటు గ్రామాభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అన్నీ మోసపూరిత హామీలే



గూగూడు గ్రామస్థులకే కాదు, కుళ్లాయి స్వామికి కూడా అధికారులు, పాలకులు మోసపు హామీలు ఇస్తున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో పాలకులు, అధికారులు విఫలమయ్యారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని, పర్యాటక కేంద్రంగా గూగూడు గ్రామాన్ని మారుస్తామని పాలకులు హామీ ఇచ్చారు. అది ఎండమావిగానే మిగిలిపోతోంది. - తలారి రాజశేఖర్

దళితవాడలో అధ్వానంగా పారిశుధ్యం



దళిత వాడలో పారిశుధ్యం అధ్వానంగా ఉం ది. పరిసరాలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో దోమలు వృద్ధి విప రీతంగా ఉంది. దీంతో రోగాల బారిన ప డుతున్నాం. కాలువలు లేకపోవడంతో ము రుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. అ ధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలి.

-అంకన్న

ప్రతిపాదనలు పంపాం



గూగూడు అభివృద్ధి కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరడం వల్ల కొత్త ఆలయం నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయి త్వరలోనే చేపడతాం. అలాగే భక్తులకు ఇబ్బందులు లేకుండా కొన్ని ప్రతిపాదనలు చేశాం. వాటిని కూడా త్వరలోనే అమలు చేస్తాం.

- శోభ, ఆలయ ఈఓ

ఇంకా అదే విధానమా..?

డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరులో పాత పద్ధతి
రైతులపై జీఎస్టీ అదనపు భారం
కొనేందుకు నిరాసక్తత.. టార్గెట్ కుదింపు


పంట పొలంలో అమర్చిన డ్రిప్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరులో వైసీపీ ప్రభుత్వం అమ లు చేసిన పాత సబ్సిడీ విధానాన్నే అమలు చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు జీఎస్టీ అదనపు భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ డీడీలు కట్టేందుకు ఎక్కువ శాతం మంది రైతులు వెనుకంజ వేస్తున్నారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పర్యటనలకు వెళ్లిన సమయంలో స్థానిక రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లకు సబ్సిడీని పెంచాలని కోరుతున్నారు.

టార్గెట్ కుదింపు..!

2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం జిల్లాకు భారీగానే డ్రిప్, స్ప్రింక్లర్ల టార్గెట్ విధించింది. ఉమ్మడి జిల్లాకు గతంలో అత్యధికంగా 23వేల హెక్టార్ల దాకా లక్ష్యం విధించారు. ఇందులో అనంత జిల్లా 13వేల హెక్టార్లు ఉండింది. ఈ సారి అంతకు రెట్టింపుగా 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు టార్గెట్ విధించారు. గతేడాది ఆగస్టు నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 38495 మంది రైతులు 51337 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో 22752 మంది రైతులకు సంబంధించి 27698 హెక్టార్లల్లో ప్రాథమిక పరిశీలన పూర్తి చేశారు. వీరిలో 10316 మంది రైతులు 12233 హెక్టార్లకు నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించారు. ఇందులో 9699 మంది రైతులకు చెందిన 11499 హెక్టార్లకు జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారు. కాగా 7003 మంది రైతులకు సంబంధించి 8316 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు సరఫరా చేశారు. అయితే ఇప్పటి దాకా 4830 మంది రైతులకు చెందిన 5735 హెక్టార్లల్లో పరికరాలు బిగించారు. పాత సబ్సిడీ విధానంతోపాటు జీఎస్టీ అదనపు భారం నేపథ్యంలో డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డీడీలు కట్టేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఏపీఎంఐపీ రాష్ట్ర ఉన్నతాధికారులు టార్గెట్‌ను 37500 హెక్టార్ల నుంచి 18వేల హెక్టార్లకు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జీఎస్టీ అదనపు భారం

పాత సబ్సిడీ విధానంలోనే డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు మంజూరుతోపాటు జీఎస్టీ అదనపు భారంగా మారింది. నాన్ సబ్సిడీపై అదనంగా 6 శాతం జీఎస్టీని విధిస్తున్నారు. దీంతో ఐదెకరాలకు పైగా పొలం ఉన్న రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నా చాలా మంది ఆసక్తి చూపడం లేదు. నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించేందుకు ఎస్టిమేషన్ వేసిన తర్వాత అదనంగా 6 శాతం జీఎస్టీ మొత్తాన్ని చూసి అంత అదనపు మొత్తం చెల్లించలేక అనేక మంది రైతులు డీడీలు కట్టకుండా మిన్నకుండిపోతున్నారు. కరువు జిల్లా రైతులకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

లోకల్ డ్రిప్ పరికరాలు కొనుగోలు చేశా



నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. కూరగాయల పంటలు సాగు చేస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకున్నా. నాన్ సబ్సిడీ డబ్బులతోపాటు అదనంగా జీఎస్టీ కట్టాలని కంపెనీ సిబ్బంది చెప్పారు. అదనంగా డబ్బులు చెల్లించడం ఎందుకని బయట లోకల్ డ్రిప్ పరికరాలు కొనుకొనుగోలు చేసి వాడుకుంటున్నాం. కరువు జిల్లా రైతులకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- చెన్నారెడ్డి, జంబులదిన్నె, గార్లదిన్నె మండలం


తక్కువ సబ్సిడీ, జీఎస్టీతో డ్రిప్ వద్దనుకున్నా..



5.30 ఎకరాల పొలంలో చీనీ పంట సాగు చేస్తున్నా. రైతు సేవా కేంద్రంలో డ్రిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నా. గత ప్రభుత్వం తరహాలోనే ఐదెకరాలకుపైగా పొలం ఉందన్న కారణంతో 70 శాతం సబ్సిడీ మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. అందులోనూ 6 శాతం అదనంగా జీఎస్టీ కట్టాలని ఎస్టిమేషన్ వేశారు. తక్కువ సబ్సిడీతోపాటు అదనంగా జీఎస్టీ చెల్లించలేక డ్రిప్ కోసం డీడీ కట్టలేదు. నాతోపాటు మా ఊర్లో 10 మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీని పెంచి రైతులందరికీ న్యాయం చేయాలి.

- రఘునాథ్‌రెడ్డి, కందుకూరు, అనంతపురం రూరల్ మండలం

లక్ష్యాన్ని తగ్గించారు



2024-25 సంవత్సరానికి డ్రిప్, స్ప్రింక్లర్ల టార్గెట్‌ను రాష్ట్ర ఉన్నతాధికారులు తగ్గించారు. తొలుత జిల్లాకు 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు కోసం లక్ష్యం విధించారు. ఇటీవల 18వేల హెక్టార్లకు లక్ష్యాన్ని తగ్గిస్తూ ఉత్త ర్వులు జారీ చేశారు. డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డీడీలు చెల్లించిన రైతులకు జిల్లా కలెక్టర్ మంజూరు ఉత్తర్వుల మేరకు సకాలంలో పరికరాలు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. సబ్సిడీ పెంపు ప్రభుత్వం చేతుల్లోనే ఉంది.

- రఘునాథరెడ్డి, పీడీ, ఏపీఎంఐపీ

పారిశ్రామికవేత్తలుగా డ్వాక్రా మహిళలు

జీవనోపాధుల పెంపునకు ప్రణాళికలు
స్వయం సహాయక సంఘాలకు ఇతోధికంగా రుణాలు
డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య


పథకాలపై సమీక్షిస్తున్న డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, ఆ దిశగా వారిని ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తీసుకువచ్చిన స్వయం ఉపాధి పథకాలపై శనివారం తన చాంబర్‌లో శాఖ అధికారులతో పీడీ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక మహిళా సంఘాల (డ్వాక్రా)కు ప్రవేశపెట్టిన జీవనోపాధుల పెంపు పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాల్లో కనీసం రెండు వేల మందిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడమే లక్ష్యం అన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే సీఎం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రధానంగా ఎస్టీ కార్పొరేషన్ నిధులతో ఆ వర్గ మహిళలకు పెరటికోళ్ల పెంపకం అమలు చేస్తున్నామని, 31 మండలాల్లో 869 మందిని గుర్తించి రూ.47.16 లక్షలు చెల్లించామని అన్నారు. ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం ద్వారా ఎస్సీ డ్వాక్రా మహిళలకు రూ.50వేల సబ్సిడీ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 31 మండలాల నుంచి 68 మందిని గుర్తించామని, వీరికి రూ.1.06 కోట్లు నిధులు మంజూరు చేశామని అన్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు త్వరలో చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద డ్వాక్రా మహిళలకు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా హోంకంపోస్టింగ్, కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 12,569 మందిని గుర్తించామన్నారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణాభివృద్ధిశాఖ (సెర్ప్) ద్వారా స్వీప్ ప్రాజెక్ట్‌ను శింగనమల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నాలుగేళ్లపాటు ఈ పథకం అమలు చేస్తామన్నారు. ఏడాదికి ఒక్కో మండలంలో 25 మంది చొప్పున 150 మందిని, నాలుగేళ్లలో 600 మందికి పైగా డ్వాక్రా మహిళలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ పథకాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న డ్వాక్రా సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకుని, జీవనోపాధుల పెంపుతో పేదరికం నుంచి విముక్తి పొందేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంలు గంగాధర్, సత్యనారాయణ, రవీంద్రబాబు, ఏపీఎంలు భాస్కర్‌నాయుడు, మంజుల పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఈతకెళ్లి విద్యార్థి మృతి

● మృతదేహాన్ని రాత్రి వెలికి తీసిన గజ ఈతగాళ్లు


వీరాచారి(ఫైల్)

గుత్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బావిలో ఈతకెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. స్థానిక కోట వీధిలోని రాజాబావిలో ఈతకెళ్లిన వీరాచారి (15) అనే పదో తరగతి విద్యార్థి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని ఆచారి కాలనీకి చెందిన గోపాలచారి, రాజమ్మ దంపతుల కుమారుడు వీరాచారి కోట వీధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం కోటలోని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం వద్ద అన్నదాన కార్యక్రమానికి వెళ్లి పాఠశాలకు వచ్చాడు. తోటి స్నేహితులతో కలసి రాజా బావి వద్దకు వెళ్లారు. సరదాగా బావిలో దిగుదామని మిత్రులతో అన్నాడు. ఈత రాదని వారెవరూ ముందుకు రాలేదు. కొద్దిగా ఈత తెలిసిన వీరాచారి బట్టలు విప్పి గట్టుమీద పెట్టి బావిలోకి దూకాడు. ఎంతసేపటికి పైకి రాకపోవడంతో తోటి విద్యార్థులు పాఠశాల వద్దకు వెళ్లి విషయాన్ని ఉపాధ్యాయులకు తెలిపారు. బావి వద్దకు చేరుకున్న ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం అందించి స్థానిక ఈత గాళ్లతో గాలించారు. విద్యార్థి ఆచూకి లభించకపోవడంతో గుంతకల్లు ఫైర్‌సిబ్బంది, గజ ఈతగాళ్లతో గాలించారు. రాత్రి 7గంటలకు లైట్లు వేసి కొనసాగించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్, మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా, ఎంఈఓ రవినాయక్‌తో పాటు సంబంధిత అధికారులు అక్కడే ఉండి పర్యవేక్షించారు. ఎట్టకేలకు వీరాచారి మృతదేహాన్ని గజ ఈతగాళ్లు రాత్రి వెలికితీశారు. దీంతో కుటుంబసభ్యులు మృతదేహం మీద పడి బోరున విలపించారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బాలుడి సోదరి మృతదేహంపడి బోరున విలపించారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

● బంగారం స్వాధీనం.. వాహనాలు సీజ్

రాప్తాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలలో దొంగతనాలకు పాల్పడిన మహమ్మద్ రఫీ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 12 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీహర్ష శనివారం తెలిపారు. కడప జిల్లా దువ్వూరు మండలం జిల్లాల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ.. మొత్తం 8 దొంగతనం కేసుల్లో ప్రధాన ముద్దాయి అని సీఐ తెలిపారు. నాలుగు జిల్లాలో చోరీ చేసిన సుమారు 47 తులాల బంగారాన్ని బెంగళూరులోని అట్టికా గోల్డ్ కంపెనీలో అమ్మేశాడు. వచ్చిన డబ్బుతో కారు, బుల్లెట్, స్కూటీ కొనుగోలు చేశాడు. వాటిని సీజ్ చేశామని సీఐ తెలిపారు. బెంగళూరులో గోల్డ్ కంపెనీకి అమ్మిన 47 తులాల బంగారాన్ని రికవరీ చేసేందుకు ఆ కంపెనీకి నోటీసులు జారీ చేశామని తెలిపారు. నిందితుడిపై కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలలోని పోలీస్‌స్టేషన్‌లలో పాత చోరీ కేసులు కూడా ఉన్నాయని సీఐ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం.. కేసు నమోదు

కల్లూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యంపై శనివారం కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు వివరాలు... అనంతపురం జిల్లాకు చెందిన తనూజ (19) ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతోందన్నారు. ఈనెల 13వ తేదీన కళాశాల నుండి విద్యార్థిని తన తండ్రితో ఫోన్‌లో మాట్లాడిందన్నారు. అదే రోజు సాయంత్రం ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఆమె తండ్రి కళాశాలకు వచ్చి విచారించగా అక్కడ కనిపించలేదు. దీంతో చుట్టుప్రక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో అదృశ్యమైనట్లు గుర్తించి ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

లొంగిపోయిన బూసుపల్లి

● గోవా లిక్కర్ కేసు ప్రధాన నిందితుడు
● పోలీసుల కళ్లుగప్పి.. కోర్టులో సరెండర్
● కస్టడీ పిటిషన్ వేసిన ఎక్సైజ్ పోలీసులు


కోర్టులో లొంగిపోయిన బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గోవా మద్యం అక్రమ రవాణా, విక్రయం కేసు ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్ రెడ్డి జిల్లా కోర్టులో సరెండర్ అయ్యాడు. రెండు నెలలుగా ఎక్సైజ్ పోలీసులకు దొరక్కుండా తిరిగాడు. తన న్యాయవాది ద్వారా బెయిల్ కోసం రెండుసార్లు హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. దీనిపై హైకోర్టు సీరియస్ అయినట్లు తెలిసింది. బెయిల్ ప్రయత్నాలు బెడిసికొట్టడంతో నాలుగు రోజుల క్రితం అత్యంత రహస్యంగా సరెండర్ అయ్యాడు. జిల్లా కోర్టు రెఫర్ చేయడంతో ఎక్సైజ్ కోర్టు నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించింది. రాజకీయ ప్రమేయం ఉండటంతో నిందితుడి లొంగుబాటు గురించి ఎక్సైజ్ శాఖ గోప్యత పాటించిందని సమాచారం.

కస్టడీ పిటిషన్: గోవా అక్రమ మద్యం కేసులో విచారణ కోసం ప్రధాన నిందితుడిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఎక్సైజ్ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయాన్ని అనంతపురం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ ధ్రువీకరించారు. త్వరలోనే కోర్టు కస్టడీకి ఇవ్వొచ్చని ఆయన అన్నారు. ఏపీ కోణాలలో విచారించాలనే విషయమై ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే సూచనలు వచ్చినట్లు తెలిసింది. గత ఏడాది డిసెంబరు 9న రాప్తాడు రైల్వే గేటు సమీపంలోని ఓ తోటలో రూ.44 లక్షల విలువైన 474 బాక్సుల గోవా మద్యాన్ని అనంతపురం ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు. అదే రోజున ఐదుగురు నిందితులను, ఆ తర్వాత మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వీరందరూ ఇప్పటికే బెయిల్‌పై బయటకు వచ్చారు. ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి మాత్రం పరారీలో ఉండిపోయాడు. రెండు మాసాలుగా ఎక్సైజ్ పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి నెల్లూరు, హైదరాబాద్, కర్ణాటక, అనంతపురం సమీప ప్రాంతాల్లో గాలించారు. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని, దొరక్కుండా తప్పించుకున్నాడు. సివిల్ పోలీసుల సాంకేతిక సాయం తీసుకున్నా ఫలితం లేకపోయింది. కొందరు రాజకీయ నాయకుల సాయంతో పట్టుబడకుండా తప్పించుకున్నాడని ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో కస్టడీలో ఏమాత్రం విచారిస్తారోనన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.



పోరు దండోరా పుస్తకావిష్కరణ చేస్తున్న మందకృష్ణ, నాయకులు

త్వరలోనే వర్గీకరణ ఫలాలు

● డప్పు ప్రదర్శన ప్రపంచానికి చాటాలి
● కమిషన్ నివేదిక పట్ల అప్రమత్తంగా ఉండాలి
● ప్రజాప్రతినిధులు, ఉద్యోగులతో చర్చించాలి
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం సాగించిన మూడు దశాబ్దాల పోరాట ఫలాలను త్వరలోనే అందుకోబోతున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియపై శనివారం రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. నగరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వివిధ జిల్లాల నుంచి ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. ముఖ్య అతిథులుగా హాజరైన మందక్రిష్ణ మాదిగ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజును గజమాలతో సత్కరించారు. అనంతరం మందక్రిష్ణ మాట్లాడుతూ.. వర్గీకరణ సాధనలో మాదిగల సాంప్రదాయ వాయిద్యమైన డప్పు ప్రధాన పాత్ర పోషించిందన్నారు. కమిషన్ నివేదక ప్రక్రియకు తెలంగాణ ప్రభుత్వం జాప్యాన్ని ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. లక్ష డప్పులు, వేల గొంతుకల కార్యక్రమానికి పిలుపునివ్వడంతో దిగి వచ్చిన సర్కార్ వేగవంతం చేయడం ఇందుకు నిదర్శనం అన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అమరులైన కార్యకర్తల త్యాగాలను స్మరించుకునేందుకు మార్చి 1 మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. నెలల తరబడి జిల్లావారిగా సదస్సులు నిర్వహించి అభిప్రాయాలను, వినతులను స్వీకరించిన కమిషన్ నివేదిక సమర్పణ చివరి అంకానికి చేరుకుందన్నారు. ఈ సమయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరముందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ సామాజిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులతో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చొరవతో ముప్పై ఏళ్ల పోరాటం సాకారం కాబోతోందని హర్షాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. మాదిగలకు మందక్రిష్ణ ఆత్మస్థైర్యమని తెలిపారు. నమ్ముకున్న సిద్ధాంతాన్ని సాధించేందుకు మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం చేసిన నాయకత్వం మందక్రిష్ణకే దక్కిందన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, ఎమ్మెస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్, ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బిక్షాలు, జాతీయ నాయకులు సురేంద్రబాబు, నాయకులు శంకర్, గంగాధర్, హరిగోపాల్, కదిరప్ప, రమేష్, ఆంజనేయులు, నాగేంద్ర, మధుసూదన్ పాల్గొన్నారు.

నిసార్ సేవలు చిరస్మరణీయం

ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఉద్యమాల్లో నిరంతరం పనిచేసిన నిసార్ సేవలు చిరస్మరణీయమని మందకృష్ణ మాదిగ కొనియాడారు. ఎర్రనేల కొట్టాలలోని నిషార్ ఇంటికెళ్లి అతడి భార్య, కుమారుడు, కూతురిని మందక్రిష్ణ పరామర్శించారు. ఇద్దరు పిల్లలకు చదువు, ఉద్యోగం బాధ్యతలను తీసుకుని ప్రయోజకులుగా తీర్చిదుద్దుతామని హామీ ఇచ్చారు. బీసీఆర్ దాస్‌తో కలిసి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, సూరి, నరసింహులు, నాగమ్మ, శాంతి, పద్మావతి పాల్గొన్నారు.


నిసార్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మందకృష్ణ


పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ప్రతినిధులు

ప్రాణాలతో.. చెలగాటం..!

● పెద్దాసుపత్రికి క్రిటికల్ కేర్ యూనిట్
● సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్మాణం
● ఆస్పత్రికి చేరిన పరికరాలు, ఫర్నిచర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల అనాలోచిత నిర్ణయం.. జిల్లా ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఉద్దేశించిన క్రిటికల్ కేర్ సెంటర్‌ను అనువుగాని చోట ఏర్పాటు చేస్తున్నారు. ఈ సెంటర్‌ను జిల్లా సర్వజనాస్పత్రికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తే.. ఊరికి దూరంగా ఉన్న సూపర్ స్పెషాలిటీలో నిర్మిస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా సర్వజనాస్పత్రికి నిత్యం వేలాది మంది రోగులు వస్తుంటారు. వందలాది మంది ప్రాణాపాయ పరిస్థితుల్లో అడ్మిట్ అవుతుంటారు. సీరియస్ కేసులకు చికిత్స అందించడానికి అత్యవసర విభాగాల్లో సౌకర్యాలు లేవు. దీంతో క్యాజువాలిటీ ఐసీయూల్లో సీరియస్ కేసులకు సకాలంలో వైద్యం అందక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆస్పత్రికి రూ.23 కోట్లతో క్రిటికల్ కేర్ సెంటర్‌ను కేంద్రం మంజూరు చేసింది. 50 పడకలతో అవసరమైన వసతుల కల్పనకు ఆదేశాలిచ్చారు.


సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో నత్తనడకన సాగుతున్న క్రిటికల్ కేర్ సెంటర్ పనులు

ఇదెలా..?

జిల్లా ఆస్పత్రిలో అత్యవసర రోగులకు సేవలందించాలని క్రిటికల్ కేర్ సెంటర్‌కు కేంద్ర ప్రభుత్వం పీఎం ఏబీహెచ్ఐఎం కింద రూ23.75 కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణానికి రూ.16.63 కోట్లు, పరికరాలకు రూ7.12కోట్లు కేటాయించారు. మొత్తం నాలుగు ఫ్లోర్లలో భవన నిర్మాణానికి ప్లాన్ చేశారు. 2024 జనవరిలో పనులను అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రజాప్రతినిధులు హడావుడిగా ప్రారంభించారు. ఆ సమయంలో జిల్లా ఆస్పత్రిలో నిర్మించాల్సిన ఈ క్రిటికల్ కేర్ సెంటర్‌ను నగరానికి దూరంగా ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థంకాని పరిస్థితి. 2025 మార్చిలోగా పనులు పూర్తి కావాల్సి ఉన్నా.. నేటికీ స్లాబ్‌లకే పరిమితమైంది. ఇంకో ఏడాదికైనా పనులు పూర్తవుతాయా, లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్థల సమస్యతోనే..



క్రిటికల్ కేర్ యూనిట్‌ను జిల్లా ఆస్పత్రికే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ సెంటర్ నిర్మాణానికి అవసరమైన స్థలం ఆస్పత్రిలో లేదని ఇంజనీర్లు సూపర్ స్పెషాలిటీలో చూపించి, అక్కడకు మార్చారు. దాంతో మాకు సంబంధం లేదు. డాక్టర్లు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించాల్సి ఉంది. ఇప్పటికేఈ కేర్ యూనిట్‌కు సంబంధించిన కొన్ని పరికరాలు, ఫర్నీచర్ వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి నివేదించాం. కేర్ సెంటర్ నిర్మాణం పూర్తి చేసి, మాకు అప్పజెబితే అప్పటి నుంచి అక్కడ సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్

ఇబ్బందికరం..

జిల్లా ఆస్పత్రికి రేయింబవళ్లు పదుల సంఖ్యలో సీరియస్ కేసులు వస్తున్నాయి. ఇక్కడ క్యాజువాలిటీ, ఐసీయూ విభాగాల్లో తక్కువ పడకలు ఉండడంతో ఆ సీరియస్ కేసులకు బెడ్లు దొరకడం లేదు. దీంతో బయటే ఉండాల్సి వస్తోంది. ఆ సమయంలో వైద్యం అందక ప్రాణాలు పోతున్నాయి. అలాంటపుడు ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ సెంటర్ 50 పడకలతో ఏర్పాటు చేసి ఉండుంటే ఇలాంటి సీరియస్ కేసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. సూపర్ స్పెషాలిటీలో ఏర్పాటు చేయడం వల్ల ఆస్పత్రికి వచ్చిన ఈ సీరియస్ కేసులను పరీక్షించి అనంతరం క్రిటికల్ కేర్ సెంటర్‌కు రెఫర్ చేయాల్సి ఉంటుంది. ఇక్కడ ఆస్పత్రి నుంచి సీరియస్ కేసులను అక్కడికి తరలించడానికి ఎలాంటి ప్రత్యేక వాహనాలూ లేవు. అలాంటపుడు సీరియస్ కేసులను దాదాపు 10 కి.మీ. దూరంలో ఉన్న సూపర్ స్పెషాలిటీకి ఎలా తీసుకెళ్తారో అర్థంకాని ప్రశ్నగా మారింది. దీంతో క్రిటికల్ కేర్ సెంటర్‌ను సూపర్ స్పెషాలిటీలో ఏర్పాటు చేయడం పట్ల అటు వైద్యవర్గాలు, ఇటు ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆస్పత్రికి ప్రత్యేక వైద్యులు, సిబ్బందిని ప్రభుత్వం నియమించాల్సి ఉంది. ఆ దిశగా అడుగు ముందుకు పడలేదు. దీంతో క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణంపై అయోమయం నెలకొంది.

ఫర్నిచర్, పరికరాలు వచ్చేశాయ్..

క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణమే పూర్తి కాలేదు కానీ, అప్పడే అందుకు సంబంధించిన పరికరాలు, ఫర్నీచర్ జిల్లాకు చేరుతున్నాయి. ఇప్పటికే ఓటీ, ఎల్‌డీఆర్ టేబుళ్లు, ఎలెక్ట్రో సర్జికల్ యూనిట్, రేడియంట్ వార్మర్, అల్ట్రాసౌండ్ సిస్టమ్, ఐసీయూ కాట్స్ జిల్లాకు చేరాయి. వీటిని జిల్లా ఆస్పత్రిలోని ఓ రూమ్‌లో భద్రపరిచినట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. భవన నిర్మాణం ఆలస్యమైతే అప్పటి వరకు ఈ పరికరాలు భద్రంగా ఉంటాయో, లేవోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మరో ఆరునెలలు పొడిగించారు



క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణం నత్తనడకన సాగుతున్న విషయం వాస్తవమే. ఇటీవల ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ కాంట్రాక్టర్‌కు ఉత్తర్వులు ఇచ్చారు. పనులు వేగం పుంజుకుంటాయి. గడువులోగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసులు నాయుడు, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

సీమకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

● విద్యావంతుల వేదిక డిమాండ్


ఏఓ గిరిధర్‌కు వినతి పత్రం ఇస్తున్న రాయలసీమ విద్యావంతుల వేదిక సభ్యులు

పెనుకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో రాయలసీమకు ప్రత్యేకంగా 42 శాతం నిధులను కేటాయించాలని రాయలసీమ విద్యావంతుల వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏఓ గిరిధర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రాయలసీమకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రం విడిపోయిన తరువాత విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని, ప్రభుత్వ సంస్థలను అమరావతికి తరలించడం నిలిపివేయాలని, గుంతకల్ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నిర్వహించాలని, హంద్రీనీవాకు లైనింగ్ పనులు ఆపివేసి కాలువ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రమేష్, కోగిర జయచంద్ర, డిగ్రీకళాశాల అధ్యాపకులు రామన్న, జాఫర్ పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం

కదిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లతో మహిళ అదృశ్యమైనట్లు కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శివాలయం వీధిలో నివాసముంటున్న చిన్నరెడ్డెప్ప భార్య శ్రావణి భర్తపై అలిగి ఇద్దరు కుమారులతో సహా జనవరి 3న ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయిందని అన్నారు. ఇద్దరు కుమారులు వంశీకృష్ణ, దయాకర్‌ను తీసుకుని వెళ్లిందని అన్నారు. గతంలో కూడా శ్రావణి ఇలాగే అలిగి వెళ్లిపోయి, వారం రోజులపాటు తిరుపతిలో ఉండి తిరిగి వచ్చిందని తండ్రి శ్రీరాములు తెలిపారు. ఈసారి కూడా అలాగే వస్తుందని నెల 20 రోజులు ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. శనివారం తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే డయల్ యువర్ డీపీఓ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికే డయల్ యువర్ డీపీఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన డయల్‌యువర్ డీపీఓ కార్యక్రమంలో సిబ్బంది జీతభత్యాలు, సరెండర్ సెలవులు, ఈఎల్ఎస్, మెడికల్ సెలవులు, హెచ్ఆర్ఏ, ఇంక్రిమెంట్లు వంటి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరింటెండెంట్లు సరస్వతి, మల్లికార్జున, సూర్యతేజ పాల్గొన్నారు.

పగలు.. రాత్రి బిజీ బిజీ..!

అంతర్రాష్ట్ర దొంగ కథే వేరు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలను ఉదయం చోరీలు చేసి.. రాత్రిళ్లు కరిగించి బిస్కెట్‌గా మార్చి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర దొంగ సుహైల్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతన్నుంచి 350 గ్రాముల బంగారం బిస్కెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. పెనుకొండ సర్కిల్ కార్యాలయంలో సీఐ రాఘవన్ ఈ కేసు వివరాలను శనివారం వెల్లడించారు. పెనుకొండ నారాయణమ్మ కాలనీలో ఉపాధ్యాయుల ఇళ్లలో జనవరి 20న సుహైల్ ఖాన్ చొరబడి, 470 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ చేశాడని సీఐ తెలిపారు. బెంగళూరుకు చెందిన సుహైల్ చోరీ చేసినట్లు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించామని, తుమకూరులో శివానగర్‌లో ఈ నెల 13న అరెస్టు చేశామని తెలిపారు. రిమాండ్‌కు తరలించిన అనంతరం కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని విచారించామని తెలిపారు. నిందితుడు చోరీ చేసిన బంగారాన్ని కరిగించేందుకు ఆన్‌లైన్‌లో పరికరాలను కొనుగోలు చేశాడని అన్నారు. బిస్కెట్ బంగారాన్ని హైదరాబాద్‌లోని ఓ దుకాణంలో విక్రయించాడని తెలిపారు. అక్కడ రికవరీ చేశామని తెలిపారు. బంగారాన్ని కరిగించే యంత్రాలు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. మొత్తం 350 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశామని, ఇందులో 250 గ్రాములు పెనుకొండలో చోరీ చేసినదని, మిగిలిన సొమ్ము కుప్పంలో రెండు చోట్ల చోరీ చేసినదని తెలిపారు. హైదరాబాద్ బంగారం వ్యాపారి కూడా మోసపోయాడని, బంగారం కొని సుహైల్‌కు రూ.29 లక్షలు ఇచ్చాడని తెలిపారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ ఎస్ఐ రాము, ఎస్ఐలు రాజేష్, వెంకటేశ్వర్లు, అంజినేయులు, కానిస్టేబుల్ ఆదినారాయణ, నాగరాజు, సుధాకర్, దస్తగిరి, రామును ఎస్పీ రత్న అభినందించారని సీఐ తెలిపారు. సుహైల్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో పలు కేసులున్నాయని, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అని తెలిపారు.


రికవరీ చేసిన బంగారం, ఆభరణాలను కరిగించే యంత్రాలను చూపుతున్న సీఐ రాఘవన్

న్యూస్ బాక్స్

శిక్షణను సద్వినియోగం చేసుకోండి : ఏపీసీ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పాల్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏపీసీ శైలజ, నోడల్ ఆఫీ సర్ కిశోర్ పేర్కొన్నారు. రాప్తాడు మోడల్ స్కూల్‌లో పర్సన లైజ్డ్ అడాప్టింగ్ లెర్నింగ్ (పీఏఎల్) కార్యక్రమంపై మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు శనివారం శిక్షణ ఇచ్చారు. సమగ్రశిక్ష అధికారులు నారాయణస్వామి, గురుముని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ పరీక్షా ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ ఇంజనీరింగ్ పరీక్షల ఫలితాలను శనివారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగ ప్రసాద్‌నాయుడు తన కార్యాలయంలో విడుదలచేశారు. ఫలి తాల కోసం జేఎన్టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఉమ్మడి పీజీ ప్రవేశాలను రద్దుచేయాలి

● ఐక్య విద్యార్థి సంఘాల నిరసన

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారిందని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. పీజీ ప్రవేశాలకు ఉమ్మడి పరీక్షల నిర్వహణ ప్రక్రియను రద్దు చేయాలని శనివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిరసన వ్యక్తంచేశారు. ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, ఏఐ ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎస్సీ వర్గీకరణ కమిషన్ సమావేశంలో ఆన్‌లైన్ రమ్మీ ఆడిన డీఆర్వో మలోలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి తెలిపారు. ధర్నా అనుమతి కోరుతూ శనివారం డీఎస్పీ కార్యాలయం వద్ద సాకే హరి మాట్లాడారు. నాయకులు రాజు, శ్రీనివాసులు, సుధాకర్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖా స్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశం కోసం నుంచి మార్చి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు న్నారు. మరిన్ని వివరాలకు ఆదర్శ పాఠశాల లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

సబ్సిడీతో గడ్డి విత్తనాల పంపిణీ

శింగనమల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు ఇవ్వనున్న ట్లు శిం గనమల పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పద్మనాభం శనివారం తెలిపారు. శింగనమల పశు వైద్యశాలకు మెట్రిక్ టన్ను, తరిమెలకు రెండు, సలకం చెరువుకు మూడు, గా ర్లదిన్నె కు రెండు, ఎర్రగుంట్లకు పశు వైద్య శాలకు రెండు టన్నులు కేటాయించారని తెలిపారు.

'దళిత మహిళలపై దాడి దుర్మార్గం'

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కూడేరు మండలం కడదరకుంట గ్రామంలో దళిత మహిళలపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల ఎల్లన్న డిమాండ్ చేశారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత మహిళలను పరామర్శించి నట్లు తెలిపారు. ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు కేపీ నారాయణస్వామి, చిన్న పెద్దన్న, ఎంఎస్ఎఫ్ నగేష్, చంద్ర, పక్కీరప్ప, శీనా, శాంతకుమార్, ఓబులురాజు, రామచంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడిపై దాడి... పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుడు ఆదినారాయణపై జరిగిన దాడి ఘటనపై మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో భాగంగా వేణు గోపాల్‌నగర్‌లో ఓ ఇంటి ఎదుట మురుగు కాలువపై బండలను తొలగిస్తున్నాడన్నారు. ఆ ఇంటి యజమాని గీత అతడిపై దాడి చేసిందని సీఐకి వివరించారు. సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా నగరంలో కార్మికులపై దాడులు చేస్తే చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ బాలస్వామి ఓ ప్రకటనలో హెచ్చరించారు.

మహిళపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

నగరంలోని వేణుగోపాల్‌నగర్‌లో నగరపాలిక పారిశుధ్య కార్మికుడు ఆదినారాయణపై దాడి చేసిన ఘటనలో గీత అనే మహిళపై వన్‌టౌన్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. కాలువ తీసే విషయంలో ఆదినారాయణ, మరో మహిళా కార్మికురాలితో గీత గొడవ పెట్టుకుని దాడి చేసిందని బాధితులు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గార్లదిన్నె, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెనకచెర్ల గ్రామానికి చెందిన ఈడిగ లక్ష్మీదేవి (65) అనే మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈడిగ లక్ష్మీదేవి కసాపురంలో జరుగుతున్న బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి గార్లదిన్నెకు రైలులో వెళ్లింది. అక్కడి నుంచి స్వగ్రామానికి కల్యాణి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మార్గం మధ్యలో కిందకు పడింది. గాయపడిన ఆమెను అనంతపురంలోని ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం డ్రైవర్‌పై కేసు

గార్లదిన్నె, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కల్లూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై లగేజీ బొలేరో వాహనం బోల్తా పడి నాగులగుడ్డం తండాకు చెందిన 10 మంది కి కూలీలకు గాయాలైన విషయం తెలిసిందే. అయితే డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని కూలీల ఫిర్యాదు మేరకు డ్రైవర్ వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

40 మంది ఉద్యోగాలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కియ కంపెనీలో ఉద్యోగాలకు 40మంది నిరుద్యోగులు ఎంపికయ్యారు. స్థానిక ఎస్సీ ఐటిఐ కళాశాలలో శనివారం కియలో వివిధ ఉద్యోగాల భర్తీకి సంభవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. సుమారు వందమందికి పైగా నిరుద్యోగ అభ్యర్థులు హాజరు కాగా 40మంది ఉద్యోగాలకు అర్హత సాధించారు. కియ ప్రతినిధి రవిశంకర్, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, సంభవ్ ఫౌండేషన్ మేనేజర్ నాగమణి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆ లేఖ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు..?

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గత వారంలో ఆత్మహత్య చేసుకున్న భువనేశ్వరి ఆత్మహత్య కేసులో ఓ లేఖ కీలకంగా మారింది. అది ఆమె రాసినదేనా...?లేక మరొకరిదా...? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ లేఖను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని నిర్ణయించారు. దీనిపై సీఐ శేఖర్‌ను వివరణ కోరగా...లేఖ ఇచ్చినది వాస్తవమేనని..అయితే అది ఆ యువతి రాసినదా..? కాదా..? అనే కోణంలో విచారించాల్సి ఉందని ఆయన తెలిపారు.

సరస్వతీ అలంకరణలో.. నీలకంఠుడు



నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శని వారం నీలకంఠుడు కూరగాయలతో అలంకరించిన హంస వాహనంపై సరస్వతీదేవిగా దర్శనమిచ్చాడు. ఉదయం ఆలయం లో మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణ, విశేష పూజా కార్యక్రమాలు, దీక్షాహోమం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన హంసవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని సరస్వతీదేవిగా అలంకరించి మొదటి రోడ్డు, మూడో రోడ్డు మీదుగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, నరేంద్ర చౌదరి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, చంద్ర, భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే గ్రామాభివృద్ధి

● ఎమ్మెల్యే పరిటాల సునీత



అయ్యవారిపల్లిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

రాప్తాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండలంలోని అయ్య వారిపల్లిలో రూ. 40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కొన్నేళ్ల నుంచి రోడ్డు సమస్యతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు తెలుపడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయించామన్నారు. టీడీపీ కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రాప్తాడు నియోజక వర్గంలోని అనేక గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో రోడ్ల సమస్య లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ కిషోర్, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచులు శశికళ, తిరుపాలు, ఉప్పర శ్రీనివాసులు, ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

నేడు సదాశివకాలనీలో భూమి పూజ

అనంతపురం రూరల్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపల్లి పంచాయతీ సదాశివకాలనీలో ఆదివారం సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వ హిస్తున్నట్లు కుమ్మర శాలివాహన సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరవుతారని తెలిపారు.

క్రిస్టియన్లకు రూ.400 కోట్లు కేటాయించండి

● సీఎం చంద్రబాబుకు స్వామిదాస్ వినతి



సీఎంకు వినతి పత్రం ఇస్తున్న స్వామిదాస్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : క్రిస్టియన్ల సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.400 కోట్లు కేటాయించాలని సీఎం చంద్ర బాబు నాయుడును టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ కోరారు. ఈ మేరకు శనివారం అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. పాస్టర్లకు గౌరవ వేతన అందించాలని, క్రైస్తవ విద్యార్థులకు విదేశీ విద్యకు నిధులు కేటాయించాలన్నారు. క్రైస్తవుల జెరూసలెం యాత్రలకు నిధులు ఇవ్వడంతో పాటు స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. చర్చిల అభివృద్ధికి నిధులు మరింత పెంచాలని, క్రైస్తవుల అభివృద్ధి కోసం క్రిస్టియన్ కార్పొరేషన్‌ను తిరిగి బతికించాలని సీఎంను కోరారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు స్వామిదాస్ స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే చొరవతో అబుల్ కలాం విగ్రహ పునరుద్ధరణ

● టీడీపీ మైనార్టీ నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణలో పక్కన పెట్టిన మౌలానా అబుల్ కలాం విగ్రహాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చొరవతో తిరిగి ఏర్పాటుచేసినట్లు టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. అబుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని శనివారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఆయన చిత్రపటా నికి పూల మాల వేసి నివాళులర్పించారు. నాయకులు గంగారామ్, కుంచెపు వెంకటేష్, ముక్తియార్, సైపుద్దీన్, పీఎల్ఎన్‌మూర్తి, ఇస్మాయిల్, ఫిరోజ్ అహ్మద్, పీఎం లక్ష్మీప్రసాద్, నెట్టెం బాలకృష్ణ, రామలింగం, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

'ఐదేళ్లలో ఎన్నిసార్లు నిధులు కేటాయించారు..?'

గత ఐదేళ్లలో ఎన్ని సార్లు బడ్జెట్‌లో నగరానికి నిధులు కేటాయించారని టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు మేయర్‌ను ప్రశ్నించారు. నాయకులు సైపుద్దీన్, ఇస్మాయిల్, ముక్తియార్, ఫిరోజ్ అహ్మద్, ముస్తాక్, ఖలందర్ శనివారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో డివిజన్‌కు రూ. 25 కోట్లు తెచ్చి ఉంటే 23వేల ఓట్లతో ఎందుకు ఓడిపోయారో సమాధానం చెప్పాలని నిలదీశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ఇప్పటికే పలు మార్లు సీఎం దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారని, ఈ బడ్జెట్‌లో దీనిపై నిర్ణయం ఉంటుందన్నారు. నడిమి వంక, మరువ వంక ప్రొటెక్షన్ వాల్స్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారన్నారు. నగరంలో మూడు నెలల పాటు మురుగు నీరు సరఫరా చేసిన మీరు వేసవి రాకముందే ఉచిత సలహాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

సైబర్ మోసాలపై అవగాహనే లక్ష్యం : ఎస్పీ



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా చోటు చేసుకుంటున్న తరుణంలో జిల్లా ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోకుండా అవగాహన తీసుకురావడమే తమ లక్ష్యమని ఎస్పీ జగదీష్ స్పష్టం చేశారు. సైబర్ సురక్ష(మన భద్రత-మన బాధ్యత) కార్యక్రమంలో భాగంగా పోస్టర్లు అతికించిన ఆటోల ర్యాలీని ఎస్పీ శనివారం ఆర్ట్స్ కళాశాల ఎదుటు ఉన్న మైదానంలో జెండా ఊపి ప్రారంభించారు. 200పైగా ఆటోలు పాల్గొన్న ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారులపై కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. గత 10రోజుల నుంచి సైబర్ సేఫ్ అనంతపురం కోసం సైబర్ సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టామని తెలిపారు. ఇప్పటివరకు 450 గ్రామాలు కవర్ చేశామని, నగరంలో 40 హోర్డింగుల ఏర్పాటుతో ప్రజల్లో అవగాహనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు షేక్ జాకీర్, సాయినాథ్, శ్రీకాంత్‌యాదవ్, రఘుప్రసాద్, విద్యార్థులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక డ్రైవ్‌తో చెత్త నిర్మూలన: డీపీఓ

అనంతపురం న్యూటౌన్/ శింగనమల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చెత్తపై సమరం చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజ నాయుడు పేర్కొన్నారు. ఆయన శనివారం జిల్లా పంచాయతీ కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్, కమిషనర్ కృష్ణ తేజ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చేవిధంగా శని, ఆది వారాల్లో జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. తాను నియోజక వర్గం కేంద్రమైన శింగనమల, మండలంలోని సి.బండమీదపల్లితో పాటు మరో మూడు మండలాల్లో పరిశీలించినట్లు తెలిపారు.

● అనంతపురం రూరల్: గ్రామాల్లో చెత్త సేకరణకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ దివాకర్ అన్నారు. ఆయన శనివారం మండలంలోని ఉప్పరపల్లి, ఆకుతోటపల్లిలో ఇంటింటా చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఉదయాన్నే ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, పంచాయతీ కార్యదర్శులు అశోక్‌బాబు, బాబా ఫక్రుద్దీన్, సర్పంచు సావిత్రి తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చెత్త సంపద తయారీ కేంద్రం ఆవరణంలో మొక్కలు నాటారు.

ఆప్కాస్ రద్దు సరికాదు : ఏఐటీయూసీ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఆప్కాస్ రద్దు నిర్ణయం సరికాదని ఏఐటీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి రాజారెడ్డి పేర్కొన్నారు. ఆ సంఘం కార్యాలయంలో శనివారం జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పజెప్పాలని చూస్తోంద న్నారు. ఇది సరికాదన్నారు. అలాగే ఈ నెలలో జరగాల్సిన ఏఐటీయూసీ శిక్షణా తరగతులను మార్చి 22 నుంచి నిర్వహించేలా వాయిదా వేశామని తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో మట్కా నిర్వహిస్తున్న నలుగురిని వన్‌టౌన్ పోలీ సులు అరెస్ట్ చేశారు. నగరంలోని గుత్తిరోడ్డులోని ఓ పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం మట్కా నిర్వహిస్తుండగా వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.29,200 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీఈఓల సమస్యలపై మంత్రితో చర్చిస్తా

● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ ఎంపీఈఓలకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేసే విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో చర్చించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. నగరంలోని ఆయన క్యాంప్ శనివారం కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, గంగరాజు, అపర్ణ, ప్రశాంతి, అరుణ, రామ్మూర్తి ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించారు. ఎంపీఈఓలకు మిని మమ్ టైం స్కేల్ వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చె న్నాయుడు, వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కమిషనర్‌కు తన లెటర్ ప్యాడ్ ద్వారా తన మెయిల్ నుంచి లేఖలు పంపారు. ఎంపీఈఓల సంఘం నాయకులు ఎమ్మెల్యేకి జ్ఞాపికను అందజేశారు.

రాతిదూలం లాగుడు పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

గార్లదిన్నె, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కల్లూరులో కొండకింద వెలసిన సింగరప్ప స్వామి దేవాలయం వద్ద శనివారం జరిగిన రాతిదూలం లాగుడు పోటీల్లో నాగర్ కర్నూల్ వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. ప్రతి యేటా మాదిరిగానే మాఘమాసం నాలుగో శనివారం ఆరుపళ్ల వృషభాలకు పోటీలు నిర్వహించారు. జిల్లాతో పాటు కర్నూల్, నాగర్ కర్నూల్, నంద్యాల జిల్లాల నుంచి సుమారు 12 జతల వృషభాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో నాగర్ కర్నూల్ జిల్లా రాయవరానికి చెందిన అక్షరరెడ్డి వృషభాలు 5031 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా నంద్యాల జిల్లా ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి బీరం బుల్స్ 4984 అడుగులు లాగి రెండో స్థానంలో, పెద్దకోట్లకు చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి వృషభాలు 4737 అడుగులతో మూడో స్థానంలో, పాలంపల్లెకు చెందిన ప్రసాద్, సోమయాజులపల్లెకు చెందిన నరసయ్య వృషభాలు 4592 అడుగులతో నాలుగో స్థానంలో నిలిచాయి. కర్నూల్ జిల్లా పందికోనకు చెందిన షేక్ మహిమున్న, మల్లెల పవన్‌కుమార్ వృషభాలు 4515 అడుగులతో ఐదో స్థానంలో, అనంతపురం జిల్లా రాయల చెరువుకు చెందిన కాశెపల్లె స్వాతికరెడ్డి, జయచంద్రారెడ్డి వృషభాలు 4200 అడుగులతో ఆరో స్థానంలో నిలిచాయి. అలాగే నంద్యాల జిల్లా నంద్యాల జిల్లా ఉంగరానిగుండ్లకు చెందిన ప్యాపిలి తనుశ్రీ, పెద్దయ్య వృషభాలు 3912 అడుగులతో ఏడో స్థానంలో, బేతంచెర్ల మెకాల బాబుజా వృషభాలు 3538 అడుగులతో ఎనిమిదో స్థానంలో నిలిచాయి. అనంతపురం జిల్లా బి. యాలేరుకు చెందిన చరణ్‌రెడ్డి, మురళీశీధర్‌రెడ్డి వృషభాలు 3394 అడుగులు లాగి తొమ్మిదో స్థానంలో నిలిచాయి. విజేతలైన వృషభాలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో నిర్వాహకులు పిల్లల రామకృష్ణ, రైస్‌మిల్ వెంకట్రాముడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు కోటంకలో...

● గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం అవరణంలో ఆదివారం రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడుపోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి మాజీ చైర్మన్ జయరాం శనివారం తెలిపారు. ప్రతి యేటా మాదిరిగానే స్వామి ఉత్సవాల్లో భాగంగా నాలుగో ఆదివారం వారం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమహతి రూ. 50వేలను ముంటిమడుగు కేశవరెడ్డి, రెండో బహుమతి రూ. 40వేలను భాస్కర్ ఫర్టిలైజర్ లిమిటెడ్ ఎండీ విజయభాస్కర్, మూడో బహుమతి రూ. 30వేలు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కాటప్పగారి రామ లింగారెడ్డి, నాలుగో బహుమతి రూ. 20వేలు టీడీపీ సీనియర్ నాయకులు గేట్‌క్రిష్టారెడ్డి, ఐదో బహుమతి రూ. 10వేలు కోటంక స్టోర్ డీలర్ కేశవయ్య ఆరో బహుమతి రూ. 5వేలు యర్రగుంట్ల మాజీ ఎంపీటీసీ ఈశ్వరయ్య అందచేస్తున్నట్లు తెలిపారు. అసక్తి ఉన్న వారు రూ. 500 ప్రవేశ రుసుం చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9885146131, 9441267743 నంబర్లను సంప్రదించాలని తెలిపారు

టమోటా, మిరపకు గిట్టుబాటు కల్పించండి

● ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాసులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా టమోటా, మిరప విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాసులు అధికారులకు సూచించారు. ఆయన శనివారం గుంటూరు నుంచి అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో మార్కెటింగ్ శాఖ ద్వారా కిలో రూ. 8తో టమోటా కొనుగోలు చేసి, ఇతర జిల్లాలకు సరఫరా చేయాలన్నారు. వచ్చే ఖరీఫ్ నుంచి టమోటా, మిరప ఒకే విడతలో అత్యధికంగా సాగు చేయకుండా రైతుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్, హెచ్‌ఓలు రత్నకుమార్, నెట్టికంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష సరికాదు: డీఎంహెచ్‌ఓ

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల పట్ల వివక్ష సరికాదని, ఈ విషయంపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రోగ్రామ్ అధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీ దేవి ఆదేశించారు. జిల్లా వైద్య కార్యాలయంలో శనివారం లింగనిర్ధారణ నిషేధిత చట్టం అమలుపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. లింగ నిర్ధారణ చట్టవ్యతిరేకమైనా ఇంకా చాలా మంది డాక్టర్లు, స్కానింగ్ సెంటర్‌లలో సంబంధిత పరీక్షలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయ న్నారు. వాటిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. లింగ నిర్ధారణ చట్టంపై వివిధ ప్రసార సాధనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి, ఆడపిల్లల నిష్పత్తి పెంచేందుకు పాటుపడుదామని సూచించారు. వైద్యాధికారులు యుగంధర్, నారాయణస్వామి, రవిశంకర్, డాక్టర్ నిస్సార్ బేగం, డాక్టరు దీప్తి, ఆర్డీటీ ప్రతినిధి డాక్టర్ హరిణి, డెమోలు త్యాగరాజు, గంగాధర్, లీగల్ అడ్వైజర్ ఆశారాణి పాల్గొన్నారు.

విద్యార్థినిని కాపాడిన ఆర్‌బీఎస్‌కే

● సర్జరీ సక్సెస్ - ఆనందించిన కుటుంబ సభ్యులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఓ పేద విద్యార్థిని ఆరోగ్యాన్ని ఆర్‌బీఎస్‌కే కాపాడింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) నిర్వహిస్తోంది. అందులో భాగంగానే కూడేరు మండలం జల్లిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆ సమయంలో ఎనిమిదో తరగతి చదువుతున్న సుమకు పుట్టుకతోనే హృదయ సమస్య ఉండొచ్చని కూడేరు పీహెచ్‌సీ డాక్టరు గుర్తించి, జిల్లా కేంద్రంలోని డీఈఐసీకి రెఫర్ చేసి పంపారు. డీఈఐసీ అధికారులు ఆ అమ్మాయికి జిల్లా సర్వజనాస్పత్రిలో 2-డీఎకో పరీక్ష చేయించగా అనారోగ్య సమస్య నిర్ధారణ అయింది. దీంతో డీఈఐసీ ద్వారా కిమ్స్ సవీరా ఆస్పత్రికి తీసికెళ్లి ఈ నెల 20న ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఆపరేషన్ చేయించారు. సర్జరీ విజయవంతం కావడంతో సుమ ఆరోగ్యంగా కోలుకుంది. ఆ బాలికను డీఈఐసీ అధికారి డాక్టర్ నారాయణస్వామి, మేనేజరు రజిత పరామర్శించారు. ఆ అమ్మాయి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేయడంతో పాటు ప్రభుత్వం అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పీ-4 ఆధారంగానే ప్రభుత్వ పథకాలు

● సర్వేను పరిశీలించిన కలెక్టర్ వినోద్‌కుమార్



సర్వే నిర్వహణను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థికం గా వెనుకబడిన వాళ్లను గుర్తించేందుకే ప్రభుత్వం పీ-4 మోడల్ సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపడుతోందదని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 41వ వార్డు సచివాలయం పరిధిలో జరుగుతున్న పీ-4 సర్వేని ఆయన శనివారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అక్కడ సిబ్బంది, ప్రజలను కలిసి ఈ సర్వే గురించి ఆరాతీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పీ-4 (ప్రభుత్వ, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్ షిప్)సర్వేని పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుక బడిన వారికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ బాలస్వామి, ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి, వార్డు రెవెన్యూ సెక్రెటరీ సరోజ తదితరులు పాల్గొన్నారు.

●నార్పల: రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూ లన కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ -4 సర్వేకి మండల ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ గంగావతి కోరారు. సచివాలయ సిబ్బంది వివరాల కోసం ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు ఖచ్చితమైన సమాచారం అందించాలన్నారు.

వీసీల నియామకం తీరు అభినందనీయం

● ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్ల నియామకంలో ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించడం అభినందనీయమని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ పేర్కొన్నారు. ఆయన శనివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో ఆరు యూనివర్సిటీలకు వీసీలను నిమించగా, ఇందులో ఎస్సీలకు రెండు, ఎస్టీలకు ఒకటి అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం 26యూనివర్సిటీలకు గాను కనీసం ఆరుగురిని నియమించాలన్నారు. ఆర్టికల్ 164ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ ఎస్టీలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని తెలిపారు.

నీవా అభివృద్ధి గురించి మాట్లాడేది..?

● తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిపై టీడీపీ నాయకుల ఫైర్

రామగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా, అభివృద్ధి, హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల గురించి నీవు మాట్లాడ టం విడ్డూరంగా ఉందని టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే తోపు దుర్తి ప్రకాశ్‌రెడ్డిపై అన్నారు. నీకు మతి ఉండి మాట్లాడుతున్నావా అంటూ మండిపడ్డారు. మండలంలోని శ్రీహరిపురం గ్రామంలో శనివారం విలేకరుల సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, రఘు రాములు, నాగేంద్ర మాట్లాడారు. వారి ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి చేసిన తప్పులను కప్పి పుచ్చు కుంటూ, ప్రెస్‌మీట్‌లు పెట్టి కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే పరిటాల సునీత గు రించి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిప్పర్లతో ఇసుకను బెంగళూర్‌కు రవాణా చేసింది నీవు కాదా అని ప్రకాశ్‌రెడ్డిని ప్రశ్నించారు. పేరూరు డ్యాంకు కాలువ ద్వారా చుక్కనీటిని తీసుకురాలేకపోయావన్నారు. దేవుడి దయతో వర్షాలు కురిసీ డ్యాంకు నీరు వస్తే, అవగాహన లేకపోవడంతో గేట్లను విరిగ్గొట్టావని విమర్శించారు.

సంక్షిప్త వార్తలు

గవిమఠం బ్రహ్మోత్సవాల పోస్టర్ల విడుదల

ఉరవకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కర్ణాటకలోని తుంకూరులో పీఠాధిపతి చెన్నబసవరాజేంద్రస్వామి శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం గవిమఠం సహాయ కమిషనర్ రాణి మాట్లాడుతూ.. మార్చి 4 నుంచి 11వ తేదీ వరకూ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9వ తేదీన మహారథోత్సవం జరపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆదోని చౌకిమఠం పీఠాధిపతి కల్యాణ్ స్వామి, ఏజెంట్ రాజన్నగౌడ్, సి బ్బంది పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని, అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సహాయ కమిషనర్ రాణిని వీర శైవ సంఘం నాయకులు కోరారు. వారు ఆమెను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచినీరు, చలువ పందిళ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. వీర శైవ సంఘం నాయకులు మల్లికార్జున, గంగాధర్, నాగన్న, నిరంజన్‌గౌడ్, బొజ్జప్ప, వీరేష్, చంద్ర, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

బెళుగుప్ప, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగుడిలో జ రుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో లక్ష్మీనారాయణ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ.. వేసవి వస్తోందని, జాగ్రత్తలు తీసుకుని పనులు చేయాలని సూచించారు. రూ. 300లు కూలి వర్తించేలా పనులు చేయాలని చెప్పారు. ఏపీవో మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్, టీడీపీ నేత మురళీ పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని గోపరాజుపల్లి, కోమటికుంట్ల గ్రామాల్లో ఉపాధిపనులను ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్ర పరిశీలించారు. ఫారంపాండ్ పనులు, చెక్‌డ్యాంలో పూడికతీత పనులను పరిశీలించి త్వర గా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌పై ముందస్తు సమావేశం

ఉరవకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టులో శనివారం లోక్ అదాలత్‌పై ఫస్ట్‌క్లాస్ జూనియర్ సివిల్ న్యాయాధికారి దుర్గాకల్యాణి ముందస్తు సమావేశాన్ని నిర్వహించారు. వచ్చేనెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ఉన్నందున రాజీదగ్గ కేసులపై ఎక్సైజ్, సివిల్ పోలీస్‌లతో చర్చించారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఐ మహానంది, ఎక్సైజ్‌సీఐ రవిచంద్ర, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు పెట్రోల్ బంకులను శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఇటీవల అనంతపురం సమీపంలోని ఓ పెట్రోల్ బంక్‌లో ఎలక్ట్రికల్ చిప్ పెట్టి రీడింగ్ టాంపర్‌తో మోసం చేస్తున్న విషయం బయట పడడంతో.. ఈ తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ సీఐ సద్గురుడు పెట్రోల్ బంకుల్లోని పంపుల్లో ఎలక్ట్రిల్ చిప్ ఏమైనాపెట్టారా అని రీడింగ్ బోర్డులను పరిశీలించారు. తనిఖీలో లీగల్ మెట్రాలాజీ సీఐ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాయదుర్గం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడేగోళం 132 కేవీ సబ్‌స్టేషన్‌లో ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేస్తున్న కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బాలచంద్ర శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు రాయదుర్గం సబ్‌స్టేషన్ పరిధిలో గల అన్ని గ్రామాల్లోనూ, రా యదుర్గం పట్టణంలోనూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాటర్‌షెడ్ పథకాలపై అవగాహన

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ వీరాపురంలో వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి వాటర్ షెడ్ పథకాలపై శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. సందర్భంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో టీ వీరాపురం, కొండాపురం, గ్రామదట్ల గ్రామాలలో గల చెక్‌డ్యాములు, నీటి కుంటల పనితీరుపై అవగాహన కల్పించారు. ప్రకృతిలో నీరు, చెట్లు, భూమి ముఖ్యమైనవని, అవి లేకపోతే మానవ మనుగడ అసాధ్యమని అన్నారు. నీటిని వృథా చేయరాదన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను విరివిగా పెంచాలని సూచించారు. అప్పుడే వానలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. అనంతరం పదిమంది వాటర్‌షెడ్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, కమిటీ సభ్యులకు మార్గదర్శ అవార్డులు అందించారు. తర్వాత గ్రామంలోని పాఠశాల విద్యార్థులు నీటి సంరక్షణపై నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ ఏపీడీ కృష్ణచైతన్య, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుంకన్న, వాటర్‌షెడ్ కమిటీ ఛైర్మన్లు బ్రహ్మానందరెడ్డి, గంగాధర్‌శెట్టి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 24వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అన్నపూర్ణ, ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జూనియర్ కళాశాలలోని విద్యార్థులు గత రెండేళ్ల నుంచి జిల్లాలోని ప్రథమస్థానంలో ఉత్తీర్ణత సాధిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే పంథాను కొనసాగించాలని సూచించారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, టీడీపీ నాయకులు పయ్యావుల నాగరాజు, పయ్యావుల అనిల్, లాలూస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు శనివారంతో ముగిశాయి. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం పలు బ్యాంకుల అధికారులు దరఖాస్తుదారులకు ఎంపీడీఓ విజయభాస్కర్ సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 61 మంది దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పల్లకిసేవను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువు దీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. మాఘ మాసం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయసిబ్బంది పాల్గొన్నారు.



ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

భోగ భాగ్యాలనిచ్చే.. భోగేశ్వరుడు

- కొలిచే భక్తుల కొంగు బంగారం
- మహా శివరాత్రికి పెద్దఎత్తున ఏర్పాట్లు

పామిడి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన శివాలయాల్లో పామిడి పట్టణంలోని భోగేశ్వరాలయం కూడా ఒకటి. ఈ ఆల యం 14వ శతాబ్ధంలో చోళుల కాలంలో నిర్మితమైంది. ఈ భోగేశ్వరున్ని పూజించే వారి ఇంట భోగబాగ్యాలు పెంపొందుతాయని భక్తులు విశ్వసిస్తారు. నిత్యం అభిషేకాలు, విశేష పూజలతో ఈ ఆలయం విరాజిల్లుతోంది.

చోళుల కాలంలో నాటి పినాకిని నది (నేటి పెన్నానది) తీరాన భోగేశ్వరు డి శివలింగాన్ని అగస్థేశ్వరుడు ప్రతిష్ఠించినట్లు గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఈ లింగం ఇసుక రేవులలో కూరుకుపోయి పుట్టలో ఉండేదట, రోజూ ఓ ఆవు పుట్టలోకి పాలు విడిచి ఇంటికి వచ్చేదట, ఒకరోజు దైవం ఆవు యజమానికి కళలో వచ్చి తాను పుట్టలో ఉన్నానని, పుట్టను పెకలించి ఆలయం నిర్మించమని ఆదేశించాడట, మరుసటి రోజు ఆవు యజమాని గ్రామస్థులతో వెళ్లి పుట్టను పెకలిస్తే అందులో గల శివలింగానికి పాముముడి వేసుకొని ఉందట, అప్పుడు గ్రామస్థులు ఆశ్చర్యపోయి కలలో చెప్పిన మేరకు ఆలయం నిర్మించారని పెద్దలు తెలియజేస్తుంటారు. నాటి నుంచి నేటి వరకూ భోగేశ్వరుడికి, ప్రసన్నపార్వతీదేవి అమ్మవారికి విశేష పూజలందుతున్నాయి. ప్రతి సోమవారం పదుల సంఖ్యలో ఏకవార రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, ఆకుపూజలు, అర్చనలు, తదితర విశేష పూజలు నిర్వహిస్తుంటారు.

కార్తీక మాసంలో లక్షదీపారాధన..

ప్రతి ఏడాది కార్తీక మాసంలో పౌర్ణమి రోజున ఈ ఆలయంలో లక్షదీపారాధన నిర్వహిస్తారు. పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో లక్షదీపారాధన చేయడం ఆనవాయితీగా వస్తోంది.

మాఘమాసంలో స్వామికి కల్యాణోత్సవం

మాఘమాసంలో ప్రతి రోజూ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే ప్రసన్న పార్వతీదేవికి, భోగేశ్వరస్వామి కల్యాణోత్సవంను కన్నుల పండువగా జరపడం విశేషం.

ఘనంగా మాస శివరాత్రి వేడుకలు..

భోగేశ్వరస్వామి ఆలయంలో ప్రతి నెలా మాసశివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మ వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహిస్తారు.

శివరాత్రి నాడు గ్రామోత్సవం..

శివరాత్రిని పురష్కరించుకుని స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా మంగళవాయిద్యాలతో ఎంతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తారు.



భోగేశ్వరుడి మూలవిరాట్



ప్రసన్న పార్వతీ అమ్మవారు

వచ్చే శివరాత్రికి ఆలయంలో ఏర్పాట్లు పెద్దఎత్తున జరుగుతున్నాయి.

పామిడికి ఆ పేరు ఎలా వచ్చిందంటే..

చోళుల పాలనలో పామిడిని శేషగ్రంథిపురం, రుషింగాపురముగా పిలిచే వారట. అయితే పుట్టను పెకలించినప్పుడు భోగేశ్వరుడి శివలింగానికి పాముముడి వేసుకొని ఉండడంతో పాముముడిగా మారింది. నాడు పాము ముడి కాలక్రమేణా పామిడిగా పిలువబడుతోంది.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం..



భోగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాము. అందులో భాగంగా వివాహ వేడుకలు జరుపుకునేందుకు వచ్చే భక్తులకు అవసరమైన మరుగుదొడ్లు, ప్రత్యేక గదుల నిర్మించాము. రాజగోపురం, నూతన ఆలయం నిర్మాణానికి తగిన చర్యలు తీసుకున్నాము. ఆలయ నిర్మాణం జరుగుతోంది. భక్తులు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తు న్నారు.

\- అంగదాల క్రిష్టయ్య, ఆలయ కార్యనిర్వహణాధికారి

శివరాత్రికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి..



శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. వేడుకలు ఈ ఏడాది మరింత ఘనంగా జరగనున్నాయి. ప్రత్యేక పూజలనంతరం స్వామి దర్శనం ఉంటుంది.

\- రామేశ్వరశర్మ, అర్చకుడు

వాటర్‌షెడ్ పనుల నాణ్యతలో రాజీపడొద్దు : ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ పనుల నాణ్యతలో రాజీ పడొద్దని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అధికారులకు సూచించారు. మండలంలోని గోళ్ల గ్రామంలో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను ఎమ్మెల్యే శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి గ్రామ ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాటర్‌షెడ్ నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలన్నారు. ఇందులో ఎవరూ రాజీ పడరాదన్నారు. అనంతరం వాటర్ షెడ్ మీద గ్రామంలో పాఠశాల విద్యార్థులు, అధికారులు, సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే విద్యార్థులకు వాటర్‌షెడ్ మీద వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా డ్వామా పీడీ సలీంబాషా, వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఏపీడీ కృష్ణ చైతన్య, పీవో శ్రీవిద్య, టీవో శేషుయాదవ్, సర్పంచ్ కవిత, వాటర్‌షెడ్ ఛైర్మన్ బొజ్జన్న, వైస్ ఛైర్మన్ లింగమయ్య, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



చెక్‌డ్యామ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని

రూ.3.50 లక్షల విలువగల మద్యం స్వాధీనం

యల్లనూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి రూ.3.50లక్షల విలువగల మద్యంను స్వాధీనం చేసుకున్నామని సీఐ సత్యఏసుబాబు తెలిపారు. తిమ్మంపల్లికి చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డిల వద్ద అక్రమ మద్యం నిల్వ ఉందని సమాచారం రావడంతో పుట్లూరు ఎస్‌ఐ వెంకటనరసింహంతో కలిసి దాడులు చేశామన్నారు. బొలెరో వాహనంలో ఉంచిన 2,679 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. వీటివిలువ సుమారు రూ.3.50లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసులో ఇద్దరినీ అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

క్షయపై అవగాహన

యాడికి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కొండకింద వీధిలో శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు పరమేశ్వర్, సిబ్బందితో కలిసి క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, సాయంత్రం జ్వరం వస్తున్నా, బరువు తగ్గుతున్నా, ఆకలి లేకపోయినా అది క్షయ అయి ఉండొచ్చని తెలిపారు. అటువంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించి వెంటనే గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఆ పరీక్ష అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేస్తారని చెప్పారు. క్షయ నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, సునీల్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది విజయలక్ష్మి పాల్గొన్నారు.



యాడికిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కుందుర్పి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో కళాజాతా బృందం సభ్యులు టీబీ వ్యాధి నివారణపై పాటల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళ్యాణదుర్గం తాలుకా టీబీ యూనిట్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, అపిలేపల్లి సర్పంచ్ అతావుల్లా, హెచ్‌ఎం ధనుంజయ, ఏఎన్‌ఎం పల్లవి, ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25లోగా పంటల నమోదు చేయించండి

పుట్లూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో రబీలో సాగు చేసిన పంటలను ఈనెల 25లోగా నమోదు చేయించాలని ఏఓ కాత్యాయిని రైతులకు శనివారం ప్రకటనలో సూచించారు. ఇప్పటికే పంట నమోదు చేసిన వారు ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని చెప్పారు.

ఉద్యోగాలకు 28మంది ఎంపిక

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో అల్ డెస్కాన్ టెక్నాలజిస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు జరిపి ఉద్యోగాలకు 28మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, జేకేసీ కోఆర్డినేటర్ నాగరాజు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తసేకరణపై అవగాహన

యాడికి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు, కోనుప్పలపాడు, గుడిపాడు, యాడికి గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణపై ప్రజలకు విద్యార్థులకు ఈఓపీఆర్‌డీ శశికళ అవగాహన కల్పించారు. ఆమె శనివారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తరహిత గ్రామాలే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ ఇంటిలో వచ్చే చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదని తెలిపారు. తడిచెత్తను పొడిచెత్తను వేర్వేరుగా ఇంటివద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. చెత్తరహిత సమాజ ఏర్పాటుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలకేంద్రంలో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు ఇంటింటికీ వెళ్లి తడిపొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని తెలిపారు. అనంతరం స్థానిక చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ శకుంతల, పంచాయతీ కార్యదర్శి మహేష్‌యాదవ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఉరవకొండ: పట్టణంలో నెహ్రూ నగర్, సత్యనారాయణ పేటలో పంచాయతీ అధికారులు ఇంటింటా చెత్త సేకరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా పొడి, తడి చెత్తలను వేర్వేరుగా ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.



యాడికిలో అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్‌డీ శశికళ

కూడేరు: మండలకేంద్రంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికులకు తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా అందజేయాలన్నారు. వాటిని చెత్తతో సంపద తయారీ కేంద్రానికి తరలించి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేస్తారని తెలిపారు. సర్పంచు లలితమ్మ, ఈఓఆర్డీ రాధాకృష్ణ, గ్రామకార్యదర్శి రమాదేవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఈఓపీఆర్డీ దాస్ పర్యటించి పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడి పొడి చెత్తను వేరు వేరు చేసి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి శివన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

యాడికి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరూరు, తూట్రాళ్లపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ హైస్కూళ్లల్లోని టెన్త్ విద్యార్థులకు కడప జిల్లాకు చెందిన వివేకానంద ఫౌండేషన్ సభ్యులు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. సంస్థ గౌరవ సలహాదారులు రాజోలి శ్రీధర్‌రెడ్డి, వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి వీడియో వైరల్

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పేచర్ల గ్రామంలో మూడురోజులక్రితం టీడీపీ కార్యకర్త ప్రకాష్‌రెడ్డిని వైసీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి, అతడి అనుచరులు స్కార్పియో వాహనంతో ఢీకొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అయింది. అయితే ఈ సంఘటనలో టీడీపీ కార్యకర్తలపైనే పోలీసులు కేసు నమోదు చేయడం గమనార్హం. గాయపడ్డ ప్రకాష్‌రెడ్డి తాడిపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

దుకాణంలో చోరీ

కణేకల్లు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కోడివంక దగ్గర ఉన్న కిరాణం దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. దీంతో బాధితుడు నబీసాబ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన దుకాణంలో ఉన్న రూ. 13 వేల నగదుతో పాటు సిగరెట్ బండిళ్లు, ఇతర వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు వివరించాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశేపల్లి టోల్‌ప్లాజా సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతను అపస్మారక స్థితిలో పడి ఉండగా అటుగా వెళుతున్న ప్రజలు గమనించి 108 వాహనంలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఆటోబోల్తా..

పెద్దవడుగూరు: మండలంలోని మిడుతూరు జాతీయ రహదారిలోని ఓ హోటల్ సమీపంలో ఓ ఆటో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆటో గుత్తి నుంచి పామిడి వైపు వెళుతుండగా.. ముందుభాగాన ఉన్న టైరు పంక్చర్ అయింది. దీంతో బోల్తాపడడంతో అందులోని ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉపాధ్యాయుడికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు: మండలంలోని చింతలచెరువు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయులు గాయపడ్డాడు. కోనాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రమేష్ విధులకు బైక్‌పై వెళుతుండగా.. చింతలచెరువు వద్ద ట్రాక్టర్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళుతున్న ప్రజలు గమనించి చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

ఘర్షణ.. ఐదుగురికి గాయాలు

విడపనకల్లు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి గ్రామంలో స్థలం విషయమై ఇరువర్గాలు వారు ఘర్షణ పడడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. పాల్తూరు పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. హావళిగి గ్రామంలో బాబు, మనోహర్ ఇళ్లు పక్క పక్కనే ఉన్నాయి, అయితే పత్తల గోడ విషయమై ఇద్దరూ వాగ్వాదం చేసుకున్నారు. అయితే మాటామాటా పెరగడంతో ఘర్షణకు దారి ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఇందులో బాబు, క్రిష్ణవేణి, మనోహర్, బసమ్మ, వెంకటలక్ష్మికి గాయాలయ్యాయి. గాయ పడిన వారిని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణ

కూడేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడదర కుంట గ్రామంలో భూ వివాదంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. భూమి కోసం గత కొంత కాలంగా బీసీ వర్గానికి చెందిన హరీష్, దళిత వర్గానికి చెందిన పెద్దన్న గొడవ పడుతున్నారు. కాగా శనివారం రెండు వర్గాలు ఘర్షణ పడి దాడి చేసుకున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు సర్ది చెప్పారు. గాయలైనవారు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలివెళ్లారు.

పీఆర్సీని తక్షణమే అమలు చేయాలి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పీఆర్సీను తక్షణమే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌనిపాటిరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఇల్లూరు లక్ష్మీనారాయణ భవనంలో శనివారం ఏపీటీఎఫ్ సమావేశం జరిగింది. ఇందులో ఆయన మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా.. ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ఇవ్వలేదన్నారు. బడ్జెట్ సమావేశాల్లో అయినా 12వ పీఆర్సీ అమలుకు తగిన నిధులు కేటాయించాలని కోరారు. నాయకులు గంగరాజు, ధనుంజయ, గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై బుగ్గరామలింగేశ్వరుడు

తాడిపత్రి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు శనివారం శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తికి ప్రత్యేకాలంకరణ చేసి పూజలు జరిపారు. ఉదయం వాసుకీ వాహనంపై, రాత్రికి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు.



శేషవాహనంపై స్వామివారు

శ్రీశైలానికి 108 బస్తాల బియ్యం అందజేత

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కుందుర్పి మండలం బెస్తరపల్లి గ్రామానికి చెందిన జీకే కృష్ణమూర్తి, పరిమళ దంపతులు శ్రీశైలం క్షేత్రానికి 108 బస్తాల బియ్యాన్ని శుక్రవారం రాత్రి మార్కాపురం శివాజీ స్వామి షిండే ఆధ్వర్యంలో లారీలో తరలించారు. ఈ సందర్భంగా ఆ దంపతులు మాట్లాడుతూ.. ప్రతి ఏటా మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి వచ్చే భక్తుల ఆకలి తీర్చేందుకు బియ్యం అందజేస్తున్నట్లు చెప్పారు. శ్రీశైల మల్లికార్జునుడు, భ్రమరాంబికాదేవి సన్నిధిలో భక్తులకు అన్నదానం చేయడానికి అవకాశం రావడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.



శ్రీశైలానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బియ్యం లారీ

మౌలానా అబుల్ కలామ్‌కు ఘన నివాళి



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమర యోధుడు, భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌ లానా అబుల్ కలామ్ ఆజాద్ వర్ధంతిని పట్టణం లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు విద్యార్థులతో కలిసి స్థానిక ఆర్‌అండ్‌బీ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, గుజరి మహమ్మద్‌ఖాజా, టెంకాయల యూనస్, షేక్ ఫజులు, రహిమాన్, వలిబాషా, ఫ్రూట్‌మస్తాన్, రంజాన్, బిల్వమస్తాన్, వాల్మీకి రాముడు తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు కూడా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొలిమిరామాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

గుత్తి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వీధిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు తొలుత స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం జరిపించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కౌన్సిల్ సాధారణ సమావేశం

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఛైర్‌పర్సన్ భవాని అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఇందులో తొలుత వైసీపీ కౌన్సిలర్ రంగమ్మ మాట్లాడుతూ.. సరస్వతీ విద్యామందిరం రైల్వే బ్రిడ్జి వద్ద నిత్యం మురుగు నీరు ప్రవహిస్తోందని, శ్మశానం వద్దకు పోవాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని, సమస్యపై కౌన్సిల్‌లో ఎన్ని సార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇందుకు కమిషనర్ నయీమ్‌అహ్మద్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో.. వైసీపీ కౌన్సిలర్లు లింగన్న, లీలావతి మండిపడ్డారు. మహిళా కౌన్సిలర్ పట్ల మాట్లాడే పద్ధతి ఇదేనా ? ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియదా?.. అంటూ ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తర్వాత అజెండాలోని అంశాలకు ఆ మోదం తెలిపారు. మున్సిపల్ అధికారులు, వైస్‌ఛైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.